
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY

గుంటూరు జిల్లా వార్తలు

5

ఆదివారం 29 సెప్టెంబరు 2024



నరసరావుపేటలోని సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహం

వసతిలో.. అర్ధాకలి

ఆకలి కేకలు.. అర్ధాకలితో వసతిగృహాల విద్యార్థులు అల్లాడుతున్నారు. తల్లిదండ్రులకు దూరంగా హాస్టళ్లలో ఉంటూ చదువుకుంటున్న విద్యార్థులు కడుపు నిండక నకనకలాడుతున్నారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందిస్తున్నట్లు పాలకులు చెబుతున్నా ఇది ఆచరణలో కనిపించడంలేదు. ప్రభుత్వం మొక్కుబడిగా వసతి గృహాలను నిర్వహిస్తుందన్న ఆరోపణలున్నాయి. తొమ్మిది నెలలుగా సంక్షేమ వసతి గృహాలకు బిల్లుల బకాయిలు పేరుకుపోయాయి. బిల్లులు ఇవ్వకపోతే విద్యార్థుల ఆకలి ఎలా తీర్చాలి.. హాస్టళ్లను ఎలా నిర్వహించాలని వార్డెన్లు ప్రశ్నిస్తే.. ఏముంది అప్పులు చేయండి.. సరుకులు తెచ్చి వండి పెట్టండి.. అంటూ ఉన్నతాధికారుల ఆదేశాలతో వసతిగృహాల నిర్వహకులు అందినకాడికి అప్పులు చేయాల్సి వస్తోంది. విద్యార్థుల కడుపు మాడ్చలేక.. అప్పులు తీర్చలేక.. బిల్లులు రాక దిక్కుతోచనిస్థితిలో సంక్షేమాధికారులు కొట్టుమిట్టాడుతున్నారు. అప్పులకు వడ్డీలు పెరుగుతుండటంతో వార్డెన్లు ఆర్థిక వేతలు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యలో ప్రభుత్వం సూచిస్తున్న భోజన పట్టికను అమలు చేయలేని దుస్థితి ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని వసతిగృహాల్లో నెలకొంది. భోజన మెనూ పరిస్థితి ఇలా ఉంటే విద్యార్థులకు ఇవ్వాల్సిన దుప్పట్లు, నోటు పుస్తకాలు, ప్లేటులతో పాటు కాస్మోటిక్ చార్జీలను ప్రభుత్వం నాలుగు నెలలుగా విస్మరించింది. సంక్షేమ వసతిగృహాల్లోని సమస్యలతో అల్లాడుతున్న విద్యార్థులకు కొన్ని నెలలుగా ఆహారం కూడా సమస్యగా మారింది. ఇక హాస్టళ్ల నిర్వహణకు విడుదల కావాల్సిన కనీస నిధులు విషయంలోనూ ప్రభుత్వం అలక్ష్యం ప్రదర్శిస్తోంది.

- విద్యార్థుల ఆకలి కేకలు
- హాస్టళ్ల నిర్వహణపై నిర్లక్ష్యం
- అప్పుల ఊబిలో హాస్టళ్ల వార్డెన్లు
- 9 నెలలుగా విడుదల కాని బిల్లులు
- విద్యార్థుల కాస్మోటిక్ చార్జీలకూ దిక్కులేదు
- దుప్పట్లు, నోట్‌బుక్స్ పంపిణీ మరిచిన వైనం
- కూటమి ప్రభుత్వంలోనూ విడుదల కాని బకాయిలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

భోజనం అందక అర్థాకలి. కప్పుకోవడానికి దుప్పటి లేదు.. తలకు నూనె లేదు.. స్నానానికి సబ్బులేదు.. రాసుకోవడానికి నోటు పుస్తకాలు లేవు.. ఇదీ ఉమ్మడి గుంటూరు పరిధిలోని హాస్టళ్ల విద్యార్థుల పరిస్థితి.



సంక్షేమం సంక్షోభంలో పడటంతో విద్యార్థులు అర్థాకలిలో అలమటి స్తున్నారు. వసతిగృహాల నిర్వహణపై నిర్లక్ష్యం అలుముకుంది. గత విద్యా సంవత్సరం డిసెంబరు నుంచి వసతిగృహాలకు ప్రభుత్వం బిల్లులు చెల్లిం చలేదు. వైసీపీ ప్రభుత్వం వసతి గృహాల నిర్వహణను పూర్తిగా గాలికి వదిలేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రారం భమైన ఈ విద్యా సంవత్సరంలో నాలుగు నెలలు గడిచినా నేటి వరకు వసతిగృహాలకు నిధులు విడుదల చేయలేదు. దాదాపు తొమ్మిది నెలలుగా వసతి గృహాల బిల్లులు రూ.కోట్లలో పేరుకుపోయినా ప్రభుత్వంలో స్పంద నలేదు. కాస్మోటిక్ చార్జీలు విద్యార్థులతో పాటు నోటు పుస్తకాలు, దుప్ప ట్లు, ప్లేట్లు, ట్రంకుపెట్టె తదితర సామగ్రి ఈ విద్యా సంవత్సరంలో ఒక్క రికి కూడా పంపిణీ చేయలేదు. ఎస్సీ విద్యార్థులకు అందాల్సిన సౌకర్యా లకూ ప్రభుత్వం గండి కొడుతున్నదన్న విమర్శలున్నాయి. వంద మంది విద్యార్థులు ఉంటే నెలకు ప్రభుత్వం భోజన బిల్లు రూ.1.40 లక్షలు చెల్లిం చాలి. ఇలా లెక్కిస్తే వంద మంది విద్యార్థులు ఉన్న వసతి గృహానికి ఇప్పటి వరకు రూ.12.60 లక్షలు చెల్లించాల్సి ఉంది. నెల నెలా అప్పు చేసి వసతిగృహాలను నిర్వహిం చాల్సి వస్తోంది. బిల్లుల బకాయి లు పేరుకు పోతుండ టంతో సంక్షేమాధికా రులు అప్పుల ఊబిలో కూరు కుపోయారు. కూరగాయలు, సరుకులు, గ్యాస్, పాలు అప్పు పద్ధతిలో కొనుగోలు చేసి బిల్లులు విడుదలైన సమయంలో వాటిని వసతి గృహాల అధికారులు గతంలో చెల్లించే వారు. వసతి గృహాలకు డీలర్ల ద్వారా బియ్యం పంపిణీ చేసే విధానాన్ని వైసీపీ ప్రభుత్వం ఎత్తేసింది. ఎంఎల్ఎస్ పాయింట్‌లో డీడీ అందజేసి బియ్యం వసతి గృహాలకు చేర్చుకోవాలి. హెచ్‌డబ్ల్యూవో లు సొంతంగా నగదు చెల్లించి బియ్యం కొనుగోలు చేయాల్సిన దుస్థితి నెలకొంది. గ్యాస్ అప్పు లభించే పరిస్థితి లేదు. గ్యాస్ సిలెండర్‌ను వార్డెన్లే కొనుగోలు చేస్తున్నారు. నెలల తరబడి బిల్లులు చెల్లించకపోవడం తో సరుకులు, పాలు, కూరగాయల సరఫరా కూడా కొన్ని వసతి గృహాల కు నిలిచిపోయింది. దీంతో ప్రైవేట్ అప్పులు చేసి వీటిని కొనుగోలు చేస్తున్నారు. నెలల తరబడి బిల్లులు విడుదల కాకపోవడంతో ప్రస్తుతం దుకాణాల్లో అప్పు దొరకని పరిస్థితులు నిర్వహకులు ఎదుర్కొంటున్నారు. బిల్లుల చెల్లింపులో ఇలానే జాప్యం జరిగితే విద్యార్థులు భోజనానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం పొంచి ఉంది. బీసీ, ఎస్సీ సంక్షేమ వసతి గృహాలకు మాత్రం ఇటీవల బిల్లుల బకాయిలు చెల్లింపులు జరిగినట్లు సమాచారం.

మెనూ.. మమ

వసతిగృహాల్లో ఉండే కళాశాల విద్యార్థులకు రోజుకు రూ.53.33, పాఠశాల స్థాయి విద్యార్థులకు రోజుకు రూ.46.66 ప్రభుత్వం చెల్లిస్తోంది. మార్కెట్‌లో ధరలను పరిశీలిస్తే ఈ ధరకు భోజనం అందించలేని పరిస్థితి. ఉదయం రోజుకో రకం వేరుశనగ చట్నీతో అల్పాహారం, పాలు, బెల్లంతో రాగి జావ, చిక్కీలు, రాత్రి భోజనం, అరటి పండు, వారంలో మూడు రోజుల చికెన్, ఆరు రోజులు ఉడికించిన గుడ్డు ఇవ్వాలి. ఇలా మెనూ అమలుకు ఒక్కో విద్యార్థికి రూ.2200 ఖర్చు అవుతున్నట్లు నిర్వహకులు చెబుతు న్నారు. పాఠశాల స్థాయి విద్యార్థులు ఒక్కొక్కరికి నెలకు రూ.2,200 ఖర్చు అవుతుంటే ప్రభుత్వం రూ.1,400 చెల్లిస్తోంది. కళాశాలల విద్యార్థులకు నెలకు రూ.1,600 మాత్రమే చెల్లిస్తుం ది. ఉప్పు, పప్పులు, కూర గాయలు నూనె, గ్యాస్ ఒకటేమిటి అన్ని వస్తు వుల ధరలు భారీగా పెరిగాయి. ఈ స్థాయిలో ప్రభుత్వం వసతి గృహా లకు బడ్జెట్ పెంచడం లేదు. వసతి గృహాల నిర్వహణ అధికారులు ప్రభుత్వం ఇస్తున్న నిధు లు సరిపోక మెనూలో కోత విధిస్తున్నారు. ప్రభుత్వం ప్రకటించిన ప్రకారం మెనూ అమ లు చేయాలంటే సదరు అధికారి జీతం మొత్తం చెల్లించాల్సి ఉంటుంది. మార్కెట్ ధరలకు అనుగుణంగా బడ్జెట్‌ను పెంచాలని పదే పదే ప్రభుత్వానికి వసతి గృహాల నిర్వహణ అధికారులు ఇస్తున్న అర్జీలపై స్పందించడంలేదు. వసతి గృహాలకు ప్రభుత్వం చెల్లించే సరుకుల ధరలకు మార్కెట్ ఉన్న ధరలకు పొంతన లేదు. మెనూ ప్రకటించిన ప్రభుత్వం విద్యార్థులకు కేటాయించిన చార్జీలను పెంచడాన్ని విస్మరించింది. దీంతో మెనూ ప్రకారం చికెన్, కోడి గుడ్డు విద్యార్థులకు ఇవ్వలేక కోతపెడుతున్నారు.



ఇంటి నుంచి నగదు వస్తేనే నూనె, సబ్బు

ప్రభుత్వం నెలవారీ కాస్మోటిక్ చార్జీలను విద్యార్థులకు చెల్లించడంలేదు. దీంతో తలకు నూనె కొనాలన్నా, స్నానానికి సబ్బు కావాలన్నా ఇంటి వైపు చూడక తప్పడంలేదు. విధి లేక ప్రతి నెలా తమ తల్లిదండ్రులను ఖర్చులకు డబ్బులు పంపమని అడగడం పరిపాటిగా మారింది. వసతి గృహాల్లోని విద్యార్థులకు ప్రతి నెలా కాస్మోటిక్ చార్జీల కింద 3 నుంచి 6వ తరగతి బాలికలకు రూ.110, బాలురకు రూ.100 అందజేయాల్సి ఉంది. 7 నుంచి పదో తరగతి వరకు బాలికలకు రూ.160, బాలురకు రూ.125 చొప్పున ఇవ్వాలి. బాలురకు రూ.30 చొప్పున హెయిర్ కటింగ్ చార్జీల కింద అదనంగా విడుదల చేయాలి. అయితే ఈ సొమ్మును ప్రభుత్వం చెల్లించకపోతుండటంతో విద్యార్థులు ఇంటికెళ్లి తమ అవసరాల నిమిత్తం డబ్బులు తెచ్చుకుంటున్నారు. ఇది తల్లిదండ్రులకు భారంగా మారుతోంది.

కనీస వసతులకు నిధులు లేవాయే

వసతి గృహాల నిర్వహణకు కొన్ని నెలలుగా ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కావడంలేదు. వసతిగృహాల్లో లైట్లు మార్చాలన్నా వార్డెన్లు జేబులో నుంచి ఖర్చు చేయాల్సిందే. మరుగుదొడ్ల నిర్వహణ, తాగునీటి తదితరాల మరమ్మతులకు ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కావడంలేదు. వైసీపీ పాలనలో వసతి గృహాలపై నిర్లక్ష్యపు గ్రహణం పట్టింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వసతి గృహాలకు మహర్దశ పడుతుందని విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు, వార్డెన్లు ఆశించారు. అయితే కూటమి ప్రభుత్వంలో కూడా వసతి గృహాల సమస్యలు పరిష్కారం కాకపోవడంతో ఆయా వర్గాల నుంచి తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది.

- ఒప్పందం ప్రకారం 40 శాతం వాటా వారిదే
- కార్మికులను దూరం పెట్టిన జూట్‌మిల్లు యాజమాన్యం
- మిల్లు స్థిర చరాస్తులపై సర్వహక్కులు తమవేనని ఇష్టారాజ్యం

గ్రీన్‌గ్రేస్‌లో కార్మికుల వాటా ఏమైందో?

గుంటూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): భజరంగ్ జూట్‌మిల్లుకు చెందిన స్థిరాస్తిలో నిర్మాణం చేపట్టిన గ్రీన్‌గ్రేస్ అపార్టుమెంట్స్‌పై తమకు కూడా హక్కు ఉందని కార్మికులు పేర్కొంటున్నారు. ఖాయిలా పడిన జూట్‌మిల్లుని తిరిగి తెరిపించినప్పుడు అన్ని స్థిర, చరాస్తులపై కార్మికులకు 40 శాతం వాటా, మిగిలిన 60 శాతం వాటా యాజమాన్యానికి కల్పిస్తూ ఒప్పందం కూడా చేసుకున్నారు. ఎప్పుడైతే బకాయిలు తీరిపోయాయో అప్పటి నుంచి మిల్లు యాజమాన్యం కార్మికులను దూరం పెట్టేసింది. అన్నింటిపై సర్వహక్కులు తమవేనని స్వీయ ప్రకటన చేసి తిరిగి మిల్లుని మూసేసింది. ఆ తర్వాత భజరంగ్ అర్బన్ ఇన్‌ఫ్రా పేరుతో ఒక సంస్థని ఏర్పాటు చేసి సుమారు 5 ఎకరాలకు పైగా ఉన్న విలువైన భూమిలో 500లకు పైగా అపార్టుమెంట్ ఫ్లాట్లను జీ+15 అంతస్తుల్లో నిర్మాణం చేపట్టింది. ఈ క్రమంలో కార్మిక యూనియన్లు, సంఘాలు బలహీనపడిపోవడంతో మిల్లు యాజమాన్యం ఇష్టారాజ్యమైపోయింది. 1994కి ముందే మిల్లు ఖాయిలా పడిన సమయంలో కేంద్ర ఆర్థిక శాఖకు చెందిన బోర్డు ఆఫ్ ఇండస్ట్రియల్ ఫైనాన్స్ రీ కన్‌స్ట్రక్షన్(బీఐఎఫ్ఆర్) సంస్థ అప్పట్లో ఉన్న బాకీలు తీర్చేందుకు కార్మికులు, మిల్లు యాజమాన్యం మధ్య ఒక ఒప్పందం చేసింది. దాని ప్రకారం రూ.40 లక్షలు కార్మికుల వాటాగా, రూ.1.20 కోట్లు యాజమాన్యం సమకూర్చేలా ఒప్పందం జరిగింది. కార్మికుల తరపున పరిశ్రమల శాఖ ఒక ఉత్తర్వు కూడా జారీ చేసింది. కార్మికులు చెల్లించాల్సిన వాటాకు సంబంధించి వాణిజ్య పన్నుల రాయితీలు కల్పించారు. కొన్ని సంవత్సరాల్లోనే మిల్లు బాకీలు తీరిపోయాయి. దాంతో 2002లో బీఐఎఫ్ఆర్ నుంచి బయటకు వచ్చేసేందుకు ఎన్‌వోసీ కోసం నివేదించారు. ఆ తర్వాత మిల్లు యాజమాన్యం స్వతంత్రంగా మారింది. వ్యాపారం వరకు మాత్రమే స్వతంత్రంగా చేసుకోవచ్చని కోర్టు ఉత్తర్వులు ఇచ్చిందే తప్ప ఎక్కడా కార్మికుల వాటాలు తొలగించలేదు. కార్మికుల వాటాలు తొలగించమని ప్రభుత్వం నుంచి సవరణ ఉత్తర్వులు రాలేదు. కార్మికులు చనిపోయేంత వరకు వారికి వాటా ఉంటుందని స్పష్టంగా ఉత్తర్వులున్నాయి. అయినా యాజమాన్యం మిల్లు స్థిర చరాస్తుల్లో కార్మికులకు ఎలాంటి వాటా లేదని, సర్వహక్కులు తమవేనని పేర్కొన్నది. 2009లో కార్మికుల తరపు నుంచి ఇద్దరు డైరెక్టర్లు యాజమాన్యంలో ఉండాలి. అయినా పెట్టలేదు. ఆ తర్వాత కార్మిక సంఘాల్లో కొందరిని కొనేసి కార్మికుల పొట్ట కొట్టింది. వాస్తవానికి ఇప్పుడు నిర్మాణం జరుగుతున్న గ్రీన్‌గ్రేస్ అపార్టుమెంట్లపై తమకు కూడా హక్కు ఉందని శ్రీ భజరంగ్ జ్యూట్‌మిల్లు జై భీమ్ కార్మిక సంక్షేమ సంఘం నాయకులు స్పష్టం చేస్తున్నారు.



నిర్మాణంలో ఉన్న గ్రీన్‌గ్రేస్ అపార్టుమెంట్స్

గుంటూరు ఛానల్ ఆధునికీకరిస్తాం

- నల్లమడ, గుంటూరు నల్లడ్రెయిన్ల నవీకరణ కూడా..
- రూ.900 కోట్లు అవసరం.. 100 కోట్ల కేటాయింపునకు కృషి
- ఇరిగేషన్, స్కిల్ డెవలప్‌మెంట్ సమీక్షలో కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని

గుంటూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతులకు అత్యధిక ప్రయోజనం కలిగే గుంటూరు ఛానల్ ఆధునికీకరణ, విస్తరణ పనులను సీఎం చంద్రబాబునాయుడు సహకారంతో ప్రారంభించి వేగవంతంగా పూర్తి చేస్తామని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఆయన కలెక్టర్ నాగలక్ష్మి, ప్రత్తిపాడు, గుంటూరు పశ్చిమ, తూర్పు ఎమ్మెల్యేలు బూర్ల రామాంజనేయులు, గళ్లా మాధవి, మహమ్మద్ నసీర్ అహ్మద్‌తో కలిసి జలవనరుల శాఖ, స్కిల్ డెవలప్‌మెంట్‌లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుంటూరు ఛానల్ పొడిగించాలని రైతులు ఎప్పటి నుంచో కోరుతున్నారని, గత టీడీపీ ప్రభుత్వ హయాంలో కృష్ణా రివర్ ఫ్లడ్ బ్యాంక్ పటిష్ఠపరచడానికి, గుంటూరు ఛానెల్ ఆధునికీకరణ, పొడిగింపు, గుంటూరు నల్ల డ్రెయిన్, నల్లమడ ఆధునికీకరణ పనులకు నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. అయితే గత వైసీపీ ప్రభుత్వం వీటిని విస్మరించిందన్నారు. గుంటూరు ఛానల్ పొడిగింపు వల్ల దాదాపు 75 గ్రామాలకు సాగు, తాగు నీరు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ ప్రాజెక్టులకు దాదాపు రూ.900 కోట్లు ఖర్చయ్యే అవకాశం ఉందన్నారు. రానున్న బడ్జెట్‌లో ప్రభుత్వం కనీసం రూ.100కోట్లు కేటాయించేలా చూడాలని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లాలని ఈ సందర్భంగా నిర్ణయించారు. స్కిల్ డెవలప్‌మెంట్‌పై జరిగిన సమీక్షలో డాక్టర్ పెమ్మసాని మాట్లాడుతూ జిల్లాలోని పరిశ్రమల్లో ఉద్యోగులకు అవసరమైన నైపుణ్యాలను తెలుసుకుని నిరుద్యోగ యువతకు వాటిపై శిక్షణ అందించేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. సమావేశంలో జల వనరుల శాఖ ఎస్ఈ ఉమామహేశ్వర రావు, ఈఈలు ఎన్‌వీకే ప్రసాద్, బీ మురళీకృష్ణ, వెంకట రత్నం, డీఆర్‌డీఏ పీడీ హరిహరనాథ్, స్కిల్ డెవలప్మెంట్ పీఐఏ సునీల్, సీడ్ ఆప్ మేనేజర్ శివప్రసాద్‌రెడ్డి, జిల్లా ఉపాధి అధికారి రఘు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ప్రణయ్, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఈడీ జబీర్‌బాషా, పరిశ్రమ శాఖ జనరల్ మేనేజర్ జయలక్ష్మి, మహిళా ప్రాంగణం మేనేజర్ కృష్ణవేణి, కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ సుభాని, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సిద్ధయ్య, నాబార్డ్ శరత్ బాబు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ప్రేమకుమారి, బీసీ కార్పొరేషన్ ఈడీ దుర్గాబాయి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న కేంద్ర మంత్రి పెమ్మసాని, ఎమ్మెల్యేలు బూర్ల, గళ్లా, నసీర్


లయోలా పాఠశాలలో ఆటల పోటీల సందర్భంగా క్రీడా జ్యోతిని వెలిగిస్తున్న ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు.

విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

వినుకొండటౌన్, సెప్టెంబరు 28: విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు కోరారు. స్థానిక లయోలా పాఠశాలలో 68వ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అండర్ -17 ఫుట్‌బాల్ పోటీలను ఆయన శనివారం ప్రారంభించారు. తొలుత ఆయన క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన క్రీడా జ్యోతిని వెలిగించి పోటీలను ఆరంభించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గత వైసీపీ ప్రభుత్వంలో హయాంలో క్రీడలను ఏర్పాటు చెయ్యడంలో పూర్తిగా విఫలమయ్యారని అన్నారు. ఎన్డీఏ ప్రభుత్వంలో హయాంలో విద్యతోపాటు, క్రీడలు, క్రీడా మైదానాలకు పూర్వవైభవం రానున్నాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు క్రీడాకారులను విశేషంగా ఆకట్టుకున్నాయి. వినుకొండ మైదానంలో త్వరలో జరిగే జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు రాష్ట్ర స్థాయి జట్టును ఎంపిక చేయడం సంతోషంగా ఉందన్నారు. ప్రతి ఒక్క క్రీడాకారుడు జట్టు విజయం కోసం కష్టపడి రాణించాలని సూచించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు నాగశ్రీను రాయల్, మేడమ్ రమేష్, రెవరెండ్ ఫాదర్ జ్ఞానదేవన్, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు ఫాదర్.రవి, ఎంఈవో జఫ్రుల్లా, టోర్నమెంట్ పరిశీలకుడు డాక్టర్ ప్రభాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం 550 మంది క్రీడాకారులకు భోజన వసతి కల్పించిన జనసేన పార్టీ నాయకులు నాగశ్రీనును నిర్వాహకులు దుశ్శాలువాతో అభినందించారు.

హోరా హోరీగా తలపడుతున్న జట్లు

రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ ఆటల పోటీలలో బాలికల విభాగంలో నెల్లూరు-పశ్చిమగోదావరి జట్లు తలపడగా నెల్లూరు జట్టు విజయం సాధించింది. విశాపట్నం- చిత్తూరు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో చిత్తూరు విజయం సాధించింది. గుంటూరు-శ్రీకాకుళం మధ్య జరిగిన పోటీలో గుంటూరు, విజయనగరం-కృష్ణ మధ్య జరిగిన మ్యాచ్‌లో కృష్ణ జట్టు విజయం సాధించింది.

బాలుర విభాగంలో గుంటూరు-శ్రీకాకుళం మధ్య జరిగిన మ్యాచ్‌లో గుంటూరు, పశ్చిమగోదావరి- ప్రకాశం మధ్య జరిగిన మ్యాచ్‌లో ప్రకాశం, విశాఖపట్టణం- కృష్ణ మధ్య జరిగిన మ్యాచ్‌లో విశాఖపట్టణం జట్టు విజయం సాధించాయి. నెల్లూరు - అనంతపురం, తూర్పుగోదావరి- కడప జట్లు మధ్య జరిగిన హోరా హోరీ పోటీలు డ్రాగా ముగిసాయి. పోటీలను తిలకించేందుకు పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థినీ, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

విద్యుత్‌శాఖలో సర్కిళ్ల పునర్విభజన

- కొత్త జిల్లాల వారీగా ఏర్పాటు
- ఎస్‌ఈల నియామకాలపై నేటికీ సందిగ్ధత

గుంటూరు, సెప్టెంబరు 28: విద్యుత్‌శాఖలో కొత్త సర్కిల్స్ పునర్విభజనకు శ్రీకారం చుట్టారు. సాధారణ బదిలీల్లో భాగంగా కొత్త సర్కిల్స్ ఏర్పాటు చేసి ఆ మేరకు బదిలీల ప్రక్రియను పూర్తి చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లాను మూడు సర్కిల్స్‌గా విభజిస్తూ ఏపీసీపీడీసీఎల్ సీఎండీ రవి ఆదేశాలు జారీ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యుత్‌శాఖలో కొత్త సర్కిల్స్ ఏర్పాటు చేసే ప్రక్రియను వేగవంతం చేశారు. ఇప్పటికే ఈపీడీసీఎల్ పరిధిలోనూ కొత్త సర్కిల్స్ ఏర్పాటు చేశారు. ముఖ్యంగా సీపీడీసీఎల్ పరిధిలో ఇప్పటికే విజయవాడ సర్కిల్‌తో పాటు మచిలీపట్నం, సీఆర్‌డీఏ, గుంటూరు, ఒంగోలు సర్కిల్స్ ఉన్నాయి. ఇందులో ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి విభజిత జిల్లాలుగా రూపాంతరం చెందిన నరసరావుపేట(పల్నాడు), బాపట్ల జిల్లాలకు కూడా కొత్త సర్కిల్స్ ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన గతంలోనే ఉంది. అయినా గత ప్రభుత్వంలో ఇది కార్యరూపం దాల్చలేదు. తాజాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యుత్‌శాఖపై ప్రత్యేక దృష్టి సారించింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని పల్నాడు, బాపట్ల జిల్లాలకు కూడా కొత్త విద్యుత్ సర్కిల్ కార్యాలయాలు ఏర్పాటు చేశారు. కాగా గుంటూరు కేంద్రంగా ఉన్న గుంటూరు సర్కిల్‌లో గుంటూరు-1 డివిజన్, తెనాలి డివిజన్, నరసరావుపేట డివిజన్‌లున్నాయి. ఇకపై పల్నాడు సర్కిల్ ఏర్పాటైతే నరసరావుపేట కేంద్రంగా ఏర్పాటు చేసిన పల్నాడు సర్కిల్‌లో నరసరావుపేట, మాచర్ల డివిజన్‌లు ఉండనున్నాయి. అలానే బాపట్ల కేంద్రంగా ఏర్పాటైన బాపట్ల సర్కిల్‌లో బాపట్ల, చీరాల, అద్దంకి డివిజన్‌లు ఏర్పాటు చేశారు. ఇక సీఆర్‌డీఏ సర్కిల్‌లో అమరావతి, గుంటూరు-2 డివిజన్‌లు యథావిధిగానే ఉన్నాయి. వీటిలో కూడా పునర్విభజన జరుగుతుందా అనేది చూడాల్సి ఉంది. కాగా బదిలీల్లో అధికారుల పోస్టింగ్‌లు కల్పించిన యంత్రాంగం కొత్త కార్యాలయాలు ఎక్కడ అనే దానిపై స్పష్టత లేకపోవడం చర్చనీయాంశంగా మారింది. సర్కిల్స్ ఆపరేషన్ సూపరింటెండెంట్ ఇంజనీర్(ఎస్‌ఈ) లుగా అదే స్థాయి అధికారులను నియమిస్తారా, ఉన్న వారికి ఉద్యోగోన్నతి కల్పించి పోస్టింగ్‌లు కల్పిస్తారనేది తేలాల్సి ఉంది. ఇక సర్కిల్స్‌లో కీలకమైన సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ (ఎస్ఏవో) అధికారి పోస్టు కొత్త సర్కిల్స్‌లో లేకపోవటం చర్చకు దారి తీస్తోంది. కాగా నేటికీ కొత్త సర్కిల్స్‌కు ఆపరేషన్ ఎస్‌ఈల నియామకాలు చేపట్టకపోవడంతో పాటు పూర్తిస్థాయిలో ఉద్యోగుల పోస్టింగ్‌లు కల్పించకపోవటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం కొత్త సర్కిల్ కార్యాలయాలకు బదిలీ చేసిన ఉద్యోగులు ఏ కార్యాలయంలో విధులు నిర్వహించాలనేది ప్రశ్నార్థకంగా మారింది.

సచ్చిదానందమూర్తి రచనలు నేటి జీవన స్థితిగతులకు మార్గదర్శకాలు

పెదకాకాని, సెప్టెంబరు 28: పద్మవిభూషణ్ ప్రొఫెసర్ కొత్త సచ్చిదానందమూర్తి ప్రపంచ తత్వవేత్తల్లో ఒకరుగా నిలుస్తారని నాగార్జున విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కే గంగాధరరావు పేర్కొన్నారు. సచ్చిదానందమూర్తి శతజయంతి ఉత్సవాల్లో భాగంగా ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని రెండు రోజుల జాతీయ సదస్సును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సదస్సు వివరాలను శనివా రం ఆయన విలేకర్లకు తెలిపారు. తత్వశాస్త్రంలో తెలుగువారి ఆత్మగౌరవ ప్రతీకగా సచ్చిదానందమూర్తి నిలుస్తారన్నారు. సంగం జాగర్లమూడి ప్రాంతానికి చెందిన కొత్త సచ్చిదానందమూర్తి సాధారణ ప్రొఫెసర్ స్థాయి నుంచి యూనివర్సిటీ గ్రాండ్స్ కమిషన్ వైస్ చైర్మన్‌గా ఎదగడం తెలుగువారికి గర్వకారణమన్నారు. సచ్చిదానందమూర్తి రచనలు నేటి ఆధునిక జీవన స్థితిగతులకు మార్గదర్శకాలుగా నిలుస్తాయన్నారు. సామాన్య రైతు కుటుంబంలో జన్మించిన ఆయన తెలుగుజాతి గర్వించేలా ఎదిగారని తెలిపారు. ఆయన జన్మించి శత వసంతాలైన సందర్భంగా ఆయనను గౌరవించుకోవడం యూనివర్సిటీ బాధ్యతని చెప్పారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం యూనివర్సిటీగా ఏర్పడక ముందు నల్లపాడులో ఏర్పాటుచేసిన పీజీ సెంటర్‌కు ఆయన స్పెషల్ ఆఫీసర్‌గా పనిచేశారన్నారు. సచ్చిదానందమూర్తి రచనలను నేటి తరానికి పరిచయం చేసేందుకు సోమ, మంగళవారాల్లో రెండు రోజుల జాతీయ సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. పద్మ విభూషణ్


సమావేశంలో ప్రసంగిస్తున్న వీసీ గంగాధరరావు

ప్రొఫెసర్ కొత్త సచ్చిదానందమూర్తి విజన్ ఆన్ ఫిలాసఫీ ఆఫ్ ఎడ్యుకేషన్ రిఫ్లెక్షన్స్ ఆన్ 21వ సెంచరీ ఎడ్యుకేషనల్ పాలసీ అండ్ ప్లానింగ్ ఇన్ ఇండియా అనే అంశంపై సదస్సును ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఈ నెల 30న జరిగే ఈ సదస్సుకు మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. అలాగే రాష్ట్ర మంత్రులు నారా లోకేశ్, అనగాని సత్య ప్రసాద్, నాదెండ్ల మనోహర్, అవనిగడ్డ, పొన్నూరు శాసనసభ్యులు మండలి బుద్ధ ప్రసాద్, ధూళిపాళ్ల నరేంద్ర కుమార్, యూపీఎస్సీ పూర్వ సభ్యులు ప్రొఫెసర్ కె. ఎస్. చలం పాల్గొంటారని పేర్కొన్నారు. సదస్సులో న్యూఢిల్లీలోని ఢిల్లీ యూనివర్సిటీ ఫిలాసఫీ విశ్రాంత ఆచార్యులు ప్రొఫెసర్ అశోక్ వోహ్రా కీలక ఉపన్యాసం ఇస్తారని వీసీ వెల్లడించారు. ఆచార్య త్రిమూర్తి రావు కన్వీనర్‌గా నిర్వహిస్తున్న ఈ జాతీయ సదస్సుకు దేశ నలుమూలల నుంచి మేధావులు, ఉన్నత విద్యావంతులు హాజరవుతారని తెలిపారు.


బహుమతులు అందజేస్తున్న వీసీ ఆచార్య పి నాగభూషణ్ తదితరులు

విజ్ఞాన్‌లో ముగిసిన ఐసీఎన్ఏఎస్‌సీ సదస్సు

గుంటూరు(విద్య),సెప్టెంబరు 28: స్థానిక వడ్లమూడిలోని విజ్ఞాన్ విశ్వవిద్యాలయంలో స్కూల్ ఆఫ్ అప్లైడ్ సైన్స్ అండ్ హ్యూమానిటీస్ విభాగం, డిపార్టుమెంట్ ఆఫ్ మ్యాథమ్యాటిక్స్ అండ్ స్టాటిస్టిక్స్ విభాగం ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ నాన్ లీనియర్ అనాలిసిస్ అండ్ సైంటిఫిక్ కంప్యూటింగ్ సదస్సు శనివారం ముగిసింది. సదస్సులో చైనాలోని షెంఝున్ యూనివర్శిటీ ప్రొఫెసర్ మెహరిన్ మజుందరణి మాట్లాడారు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య పి నాగభూషణ్ పోటీల్లో గెలుపొందిన వారికి సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు.

సచివాలయ ఉద్యోగుల సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కిషోర్

తెనాలి అర్బన్, సెప్టెంబరు 28 : సచివాలయ ఉద్యోగుల అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా అప్పికట్ల కిషోర్ ఎన్నికయ్యారు. 11వ వార్డు సచివాలయంలో పని చేస్తున్న ఆయనను శనివారం జరిగిన కార్యక్రమంలో ఈ పదవికి ఎన్నుకున్నారు. డెమోక్రటిక్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షునిగా జోసఫ్ కిషోర్, ఉపాధ్యక్షునిగా కిరణ్‌కుమార్, కోశాధికారిగా దుర్గాప్రసాద్, సంయుక్త కార్యదర్శిగా సూర్య ఎన్నికైన వారిలో ఉన్నారు. పలువురు ఉద్యోగులు వారిని అభినందించారు.



వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్నకేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

ప్రత్యామ్నాయ సాగుపై ప్రణాళికలు రూపొందించాలి

- కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

గుంటూరు సిటీ, సెప్టెంబరు 28 : రైతు ఆర్థిక పరిస్థితి మెరుగుపడే విధంగా, అధిక లాభాలు అర్జించే ప్రత్యామ్నాయ పంటలసాగుపై ప్రతి రైతుకు అవగాహన కలిగించేలా ప్రణాళికలు రూపొందించేలా వ్యవసాయ యూనివర్సిటీ పరిశోధన విభాగం పనిచేయాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ సహాయ శాఖ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. శనివారం లాంలోని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి, సంయుక్త కలెక్టర్ ఏ భార్గవతేజ, శాసనసభ్యులు తెనాలి శ్రావణ్ కుమార్, బూర్ల రామాంజనేయులతో కలసి సందర్శించి, అధికారులతో సమావేశమయ్యారు. విశ్వవిద్యాలయం పరిధిలోని వివిధ పరిశోధనా స్థానాలు, విస్తరణ కేంద్రాల నుంచి ఆధునిక వ్యవసాయ సాంకేతికతపై ఏర్పాటు చేసిన పదర్శనలోని వంగడాలు, ఉత్పత్తులు, యంత్రపరికరాలు, పరిశోధన ఫలితాలను విశ్వవిద్యాలయ ఉప కులపతి శారద జయలక్ష్మి దేవి, పరిశోధన సంచాలకులు సత్యనారాయణ కేంద్రమంత్రికి వివరించారు. విశ్వవిద్యాలయ పరిపాలన భవనాన్ని, డ్రోన్ శిక్షణా సెంటర్ కేంద్ర మంత్రి పరిశీలించారు. పరిపాలన భవనాల పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని పనులను పర్యవేక్షిస్తున్న ఏపీఐఐసి అధికారులను కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అదేశించారు. అదే విధంగా వ్యవసాయ క్షేత్రంలో వ్యవసాయ డ్రోన్ల ద్వారా పురుగుమందులు, ఎరువుల పిచికారి చేసే విధానంను కేంద్ర మంత్రి పరిశీలించి, గ్రామీణ ప్రాంతయువత డ్రోన్ శిక్షణను సద్వినియోగం చేసుకోవటంతో పాటు, ప్రభుత్వం అందించే వ్యవసాయ డ్రోన్లను క్షేత్రస్థాయిలో సక్రమంగా వినియోగించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. విశ్వవిద్యాలయం పరిపాలన భవనంలోని బోర్డు మీటింగ్ రూములో విశ్వవిద్యాలయ అధికారులు, శాస్త్రవేత్తలతో సమావేశం నిర్వహించారు. అనంతరం జిల్లాలో వరద ముంపు వలన వ్యవసాయ శాఖ జరిగిన నష్టాలు, పరిహారం అందజేతపై కేంద్ర మంత్రి చంద్రశేఖర్, జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి, సంయుక్త కలెక్టర్ ఏ భార్గవతేజ, శాసనసభ్యులు తెనాలి శ్రావణ్ కుమార్, బూర్ల రామాంజనేయులతో కలసి జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. వరద ముంపు వలన వ్యవసాయ, ఉద్యాన పంటలకు, పశువులకు జరిగిన నష్టాలు, ప్రభుత్వం మంజూరు చేసిన నష్ట పరిహారం, రానున్న రబీ సీజన్ కు విత్తనాలు, ఎరువులు సన్నద్ధత, కౌలు రైతులకు రుణాల మంజూరుపై తదితర అంశాలపై జిల్లా సంయుక్త కలెక్టర్ ఏ బార్గవ తేజ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు.

నాగార్జున సాగర్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, సెప్టెంబరు 28: నాగార్జున సాగర్ జలాశయం నీటిమట్టం శనివారం నాటికి 590.00 అడుగులకు చేరుకుంది. ఇది 308.46 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 10,350 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 5439 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 22,574 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400 క్యూసెక్కులు, ఎల్ఎల్‌సీ 400 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 41,162 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 41,162 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

ప్రకాశం బ్యారేజి దిగువకు 28 వేల 880 క్యూసెక్కులు

- డెల్టా కాలువలకు 9వేల 282 క్యూసెక్కులు

తాడేపల్లి టౌన్, సెప్టెంబరు 28: ఎగువన ప్రాజెక్టుల నుండి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టు ప్రధాన వాగుల నుండి 38 వేల 162 క్యూసెక్కుల వరద నీరు శుక్రవారం ప్రకాశం బ్యారేజి వద్దకు చేరుతున్నట్టు నీటిపారుదల శాఖ జెఈ రాజేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 11.9 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా 40 గేట్లను 1 అడుగు మేర ఎత్తి దిగువకు 28వేల 880 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. తూర్పు, పశ్చిమ డెల్టా కాలువలకు 9వేల 282 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్టు జేఈ తెలిపారు.

పీఆర్ ఉద్యోగులకు నిబంధనలపై అవగాహన తప్పనిసరి

గుంటూరు సిటీ, సెప్టెంబరు 28: పంచాయతీ రాజ్ శాఖలోని అధికారులు, అన్ని స్థాయిల ఉద్యోగులు చట్టం, ప్రభుత్వ నిబంధనలపై సంపూర్ణ అవగాహన కలిగివుండడం తప్పనిసరి అని జిల్లా పరిషత్ సీఈఓ వి జ్యోతిబసు అన్నారు. గుంటూరు జిల్లా పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ 2024- 2025 ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న రెండో రోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు.ఈ శిక్షణ కార్యక్రమంలో ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ఎంపీడీఓలు, ఈఓపీఆర్డీలు, డీఎల్‌డీఓలు పాల్గొన్నారు. రిసోర్స్ పర్సన్ జీవీఆర్ కె మూర్తి మాట్లాడుతూ గ్రామ పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్ అధికారిక ఆర్థిక వ్యవహారాల నిర్వహణపై అవగాహన కల్పించారు. రిసోర్స్ పర్సన్ సుబ్బారావు మాట్లాడుతూ గ్రామీణ నీటి సరఫరా, జల్ జీవన్ మిషన్ ఆవశ్యకతను వివరించారు. టౌన్ ప్లానింగ్ రీజనల్ డైరెక్టర్ కె మధు కుమార్ మాట్లాడుతూ భవణ నిర్మాణ అనుమతులు , లే ఔట్స్ అనుమతులపై మాట్లాడారు. భవననిర్మాణ అనుమతుల ద్వారా, లేఔట్స్ అనుమతుల ద్వారా స్థానిక స్వపరిపాలన సంస్థలకు ఆదాయం సమకూర్చుకునే అవకాశాలను వివరించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఈఓ సిహెచ్ కృష్ణ, జిల్లా శిక్షణ మేనేజర్ కంచర్ల నాగేశ్వరరావు, నిరంజన్ రావు, కరిముద్దీన్, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.35
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	130, 139,150
చికెన్ విత్ స్కిన్	248.00
చికెన్ స్కిన్ లెస్	258.00

అర్చక సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా నారాయణం వేణుగోపాల్

గుంటూరు, సెప్టెంబరు 28: ఆంధ్రప్రదేశ్ అర్చక సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా నారాయణం వేణుగోపాల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు శనివారం ఆంధ్రప్రదేశ్ అర్చకసేవా సంఘం రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంధ్యాల వెంకట రామలింగేశ్వర శాస్త్రి అధ్యక్షతన జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడిగా నారాయణం వేణుగోపాల్ ఎంపిక అయ్యారు. గత సంవత్సరం పూర్వ అధ్యక్షులు రొంపిచర్ల శేషాచార్యులు మరణించడంతో కార్యనిర్వాహక అధ్యక్షుడిగా వేణుగోపాల్ కొనసాగుతున్నారు. శనివారం జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నారాయణం వేణుగోపాల్ మాట్లాడుతూ సంఘ ఆశయాల సాధన కోసం అహర్నిశలు పాటుపడతానని, అర్చకుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. సమావేశంలో రాష్ట్ర నాయకులు బృందావనం రాధాకృష్ణమూర్తి, ఆమంచి రవికుమార్, గొట్టిపాళ్ళ కృష్ణమాచార్యులు, దీవి వెంకట శేషుబాబు, పరాశరం జగన్మోహన్, నందివెలుగు శేషగిరిరావు, పెద్దింటి ఫణి రాజేంద్రకుమార్, చెగోలం శేషాచార్యులు, వివిధ జిల్లాల నాయకులు యనమదల ఆంజనేయులు, చిట్యాల మల్లికార్జునశర్మ, వడ్లమాను రమణాచార్య, బృందావనం గోపీచంద్, మేడూరి శ్రీనివాసమూర్తి తదితరులు పాల్గొన్నారు.


మంత్రి లోకేశ్‌కు చెక్కును అందజేస్తున్న నూర్ బాషాల సంఘ నాయకులు

వరద బాధితులకు నూర్ బాషాల చేయూత

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 28: వరదబాధితులకు నూర్ బాషాలు అండగా నిలబడ్డారు. శనివారం ఉండవల్లిలోని నివాసంలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్‌కు ఏపీ నూర్ బాషా(దూదేకుల) ముస్లిం సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పీర్ మహమద్, సంఘ సీనియర్ నాయకుడు షేక్ లాల్‌వజీర్ చేతుల మీదుగా రూ. 2,63, 316 చెక్కును అందజేశారు. అనంతరం సంఘ నాయకులు మాట్లాడుతూ సంఘంలోని పలు జిల్లాల నాయకుల సహకారంతో ఈ విరాళాల్ని సేకరించామని అన్నారు. వరదల సమయంలో సంఘం తరపున అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించిన విషయాన్ని గుర్తుచేశారు. బాధితులకు సొంత ట్రస్ట్‌ల ద్వారా అనేక సహాయ సహకారాలు అందించామని అన్నారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు డాక్టర్ బాబన్, యువత అధ్యక్షుడు మస్తాన్, కోశాధికారి దస్తగిరి పర్ల, సుభాన్, ఖాజా వలీ, ఖాసీం, ఇబ్రహీం, ఆదాం షఫీ, నాగూర్, ఆరిఫ్ పాల్గొన్నారు.

కూలీ రేట్ల పెంపుదల జీవో విడుదలకు ఏఐటీయూసీ వినతి


నాదెండ్ల మనోహర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 28: సివిల్ సప్లైస్‌లో పనిచేస్తున్న ముఠా కార్మికుల కూలీ రేట్ల పెంపుదల జీవోను విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ సివిల్ సప్లైస్ కార్పొరేషన్ హమాలీ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఉపప్రధాన కార్యదర్శిలు ఎస్.వెంకటసుబ్బయ్య, రావుల అంజిబాబు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనో హర్‌కు వినతిపత్రం అందజేశారు. వారం రోజుల్లో సమస్యలను పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చినట్టు వారు తెలిపారు. ఈ హామీ మేరకు కార్మికుల ఆందోళనలను విరమిస్తున్నట్టు రావుల అంజిబాబు తెలిపారు. శనివారం స్థానిక సివిల్ సప్లైస్ గౌడన్లు వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత మూడు రోజులుగా యూనియన్ ఆధ్వర్యంలో దశల వారి ఆందోళన కార్యక్రమాలు నిర్వహించినట్లు చెప్పారు.

ప్రాయశ్చిత్త దీక్షకు ఎమ్మెల్యే సంఘీభావం

గుంటూరు, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): తిరుమల వెంకటేశ్వరస్వామి లడ్డూ కల్తీ ఘటనను నిరసిస్తూ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టిన విషయం తెలిసిందే. దీనికి మద్దతుగా గుంటూరు జిల్లా జనసేన పార్టీ నాయకులు స్థానిక ఆర్. అగ్రహారంలోని శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో శనివారం ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టారు. జనసేన పార్టీ 18వ డివిజన్ అధ్యక్షుడు శానం రమేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గల్లా మాధవి, జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనబోయిన శ్రీనివాస్‌యాదవ్, టీడీపీ నాయకులు ఉగ్గిరాల సీతారామయ్య, కాపు సంఘం నాయకులు దాసరి రాము పాల్గొని మద్దతు తెలిపారు.

ఎస్పీ చొరవతో లోక్‌అదాలత్‌లో అత్యధిక కేసుల పరిష్కారం

● జిల్లా జడ్జి పార్థసారథి

గుంటూరు, సెప్టెంబరు 28 : జిల్లా ఎస్పీ చొరవతో ఇటీవల నిర్వహించిన లోక్ అదాలత్‌లో అత్యధిక కేసులు పరిష్కారమయ్యాయని జిల్లా జడ్జి పార్థసారథి తెలిపారు. ఈ మేరకు శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జరిగిన నేరసమీక్షా సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా జడ్జి మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో అత్యధిక కేసుల పరిష్కారానికి ఎస్పీ సతీష్‌కుమార్ సహా చొరవ చూపిన అధికారులు, సిబ్బందిని ఆయన అభినందించారు. జిల్లా లీగల్ సెల్ అథారిటీ సెక్రటరీ లీలావతి మాట్లాడుతూ కేసుల్లో రాజీ మార్గమే రాజమార్గమన్నారు.

అలరించిన తెలుగు సినీ సంగీత విభావరి

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 28: స్థానిక అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజం ఆడిటోరియం వేదికగా శనివారం గుంటూరు జిల్లా సంగీత కళాకారుల సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు మద్దు వెంకటస్వామి ఆధ్వర్యంలో సంస్థ 13వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా నరసరావుపేట ఎంఎస్ బాబు బృందం వారి తెలుగు సినీ సంగీత విభావరి అలరించింది. ప్రముఖ గాయకులు తాతా బాల కామేశ్వరరావు, తాళ్ళూరి సుధీర్‌లను ఘనంగా సత్కరించారు.

పర్యావరణానికి ముప్పు తెచ్చే ప్లాస్టిక్‌ను నిషేధించండి

గుంటూరు, సెప్టెంబరు 28 : పర్యావరణానికి పెను ముప్పుగా పరిణమించిన ప్లాస్టిక్‌ను నిషేధించడమే మనముందున్న మార్గమని నల్లపాడులోని లయోల పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపల్ రెవరెండ్ ఫాదర్ సురేష్‌కుమార్ అన్నారు. ఈ మేరకు శనివారం స్కూల్‌లో ఎన్‌సిసి ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీ, మానవహారం, పరిశుభ్రత కార్యక్రమంలో 300 మంది ఎన్‌సిసి కేడెట్స్ పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా సుపీరియర్ అండ్ కరస్పాండెంట్ ఫాదర్ పోలిరెడ్డి అంతోని పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లుల చెల్లింపులకు నేడు ప్రత్యేక కౌంటర్లు

గుంటూరు, సెప్టెంబరు 28: నెలాఖరు నేపథ్యంలో గుంటూరు, సీఆర్‌డీఏ సర్కిళ్ల పరిధిలోని అన్ని విద్యుత్, రెవెన్యూ కార్యాలయాల్లో ఆదివారం కూడా కౌంటర్లు అందుబాటులో ఉంటాయని సర్కిల్స్ ఆపరేషన్ఎస్‌ఈ డాక్టర్ ప్రత్తిపాటి విజయ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే, ఇంటి నుంచే నేరుగా విద్యుత్ బిల్లులు మొబైల్‌లో ఏపీసీపీడీసీఎల్ యాప్, ఫోన్‌పే, గూగుల్‌పేలలో చెల్లింపులు జరపవచ్చని తెలిపారు. నెలాఖరు కావడంతో ఆదివారం కూడా వినియోగదారులకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

జాతీయ స్థాయి యోగా పోటీలకు బాలకుటీర్ విద్యార్థి

గుంటూరు(విద్య),సెప్టెంబరు 28: సీబీఎస్ఈ సౌత్‌జోన్ ఆధ్వర్యంలో తమిళనాడులోని చెంగల్పట్టులో నిర్వహించిన యోగా పోటీల్లో చౌడవరంలోని బాలకుటీర్ విద్యార్థి సత్తా చాటాడని సంస్థ వ్యవస్థాపకురాలు డాక్టర్ ఎస్.మంగాదేవి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తమ విద్యార్థి వ్యక్తిగత ఆర్టిస్టిక్ విభాగంలో (అండర్-19) జీ. వినయ్ సాయిరామ్ విజయం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. భవిష్యత్తులో అతను మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. సూరత్‌లో త్వరలో జరగనున్న సీబీఎస్ఇ జాతీయ పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు.

డిక్లరేషన్‌పై సంతకం పెడితే క్రైస్తవులు ఆమోదించరనా?

● జగన్‌ని ప్రశ్నించిన బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి జయప్రకాష్ నారాయణ

గుంటూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పరమత ధర్మాన్ని కాపాడాల్సిన బాధ్యత వైఎస్ జగన్‌కు లేదా? డిక్లరేషన్‌పై సంతకం పెడితే క్రిస్టియన్లు ఆమోదించరని ఆయన అనుకుంటున్నారా అని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్ నారాయణ సూటిగా ప్రశ్నించారు. శనివారం స్థానిక చంద్రమౌళీనగర్‌లోని బీజేపీ కార్యాలయంలో జరిగిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్ తిరుమలకు వెళ్లి మత విద్వేషాలు రెచ్చగొట్టాలని చూశారని, దళితులను రెచ్చగొట్టి గొడవలు పెట్టాలని కుట్ర పన్నారని ఆరోపించారు. జగన్ తన తీరు మార్చుకోకపోతే ప్రజలు తరిమి కొడతారని హెచ్చరించారు. లడ్డూ వ్యవహారంలో బీజేపీ ఎంపీలకు సంబంధం ఉందని జగన్ చెప్పడం సబబు కాదని అన్నారు.

హిందూ కళాశాలలో అధిక ఫీజు వసూళ్ళపై ఫిర్యాదు


కళాశాల వద్ద ఎస్ఎఫ్ఐ నాయకులు

గుంటూరు(విద్య),సెప్టెంబరు 28: విద్యార్థులకు కౌన్సెలింగ్‌లో వచ్చిన ఎలాట్‌మెంట్‌లో ఒక విధమైన ఫీజులు ఉండగా, కళాశాలలో మరోవిధమైన ఫీజులతో విద్యార్థులను హిందూ కళాశాల యాజమాన్యం ఇబ్బంది పెడుతోందని ఎస్ఎఫ్ఐ నాయకులు ఆరోపించారు. ఈ మేరకు కళాశాల వద్ద శనివారం ఆందోళన చేశారు. ప్రభుత్వం రూ.18 వేలు ఎలాట్‌మెంట్ ఫీజు చెల్లించాలని ఉత్తర్వుల్లో పేర్కొనగా, కళాశాల యాజమాన్యం మాత్రం రూ. 25 వేలు వసూలు చేస్తున్నట్లు నాయకులు ఆరోపించారు. ఐదు, మూడో సెమిస్టర్ పరీక్ష ఫీజు చెల్లించే సమయంలో మొత్తం ఫీజు చెల్లించాలని విద్యార్థులపై యాజ మాన్యం ఒత్తిడి తీసుకువస్తోందని అన్నారు. వెంటనే ఫీజుల విషయం పరిష్కరించకుంటే ఆందోళన చేస్తామని ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్ష,కార్యదర్శులు ఏ.యశ్వంత్, ఎస్‌కె సమీర్ హెచ్చరించారు.

బీహెచ్ డిగ్రీ కళాశాలలో నేత్ర వైద్య శిబిరం

గుంటూరు(విద్య),సెప్టెంబరు 28: స్థానిక బ్రాడీపేటలోని బండ్లమూడి హనుమాయమ్మ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో శనివారం కంటి,దంత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ ఎస్‌కె అనుషాబేగం, డాక్టర్ జస్వంత్ తదితరులు పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించారు. కళాశాల అధ్యక్ష,కార్యదర్శులు డాక్టర్ బీవీ విజయభాస్కర్, సిహెచ్ శ్రీధర్, ప్రిన్సిపల్ డాక్టర్ బీ. కౌసల్యాదేవి, వైస్ ప్రిన్సిపల్ వీ.రాధమాధవి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఎన్.లక్ష్మీదీప్తి,ఎం.గిరిజన పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని నిర్మాణాలకు ఓసీ ఇవ్వం

● సెట్ బ్యాక్ పోర్షన్‌లో ఎటువంటి నిర్మాణాలు వద్దు

● ర్యాంప్‌లు రోడ్డుపై వరకు రాకూడదు

● ఓసీకి దరఖాస్తు చేసుకున్న భవనాలను పరిశీలించిన జీఎంసీ కమిషనర్ పీ. శ్రీనివాసులు


భవనం కొలతలు పరిశీలిస్తున్న జీఎంసీ కమిషనర్ పీ.శ్రీనివాసులు

గుంటూరు(కార్పొరేషన్), సెప్టెంబరు 28 : ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల మేరకు మాత్రమే నగరంలో బహుళ అంతస్తు భవనాల నిర్మాణాలు జరగాలని, ఉల్లంఘిస్తే తగు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రణాళికా విభాగం అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామని నగర పాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. శనివారం స్థానిక ఐపీడీ కాలనీ, బుడంపాడు, బాలాజీ నగర్ తదితర ప్రాంతాల్లో ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ (ఓసీ)కి దరఖాస్తు చేసుకున్న భవనాలను ఆయన పరిశీలించారు. సెట్ బ్యాక్, రోడ్ల కొలతలను తనిఖీ చేసి, తదుపరి అనుమతు లకు సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ప్రధానంగా బహుళ అంతస్తుల నిర్మాణాలకు సంబంధించి సెట్ బ్యాక్ పోర్షన్‌లో ఏవిధమైన నిర్మాణాలు చేయకూడదని, జనరేటర్లు కూడా ఏర్పాటు చేయకూడదని చెప్పారు. ర్యాంప్‌లు రోడ్డుపై వరకు రాకూడదని, గ్రీనరీకి కేటాయించిన విధంగా ఉండాలని, వాచ్‌మెన్ రూమ్ నగర పాలక సంస్థ నుండి అనుమతి పొందిన ప్లాన్ ప్రకారమే ఏర్పాటు చేసు కోవాలన్నారు. తమ పరిశీలనకు ముందే పట్టణ ప్రణాళిక అధికారులు ఆయా భవనాలను పరిశీలించినట్లు చెప్పారు. అనుమతించిన ప్లాన్ ప్రకారమే ఆయా భవనాల నిర్మాణపు పనులు జరుగుతున్నాయా లేదా అనేది పనులు జరిగే సమయంలోనే సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు పరిశీలించాలని ఆదేశించారు. పర్యటనలో సిటీ ప్లానర్ డీ.రాంబాబు, డిప్యూటీ సిటీ ప్లానర్ శ్రీనివాస్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ అజయ్‌కుమార్, టీపీఎస్‌లు సువర్ణ కుమార్, రసూల్, ఎంహెచ్‌ఓ రామారావు, డీఈఈ శ్రీధర్, ఏఈ సునీల్ కుమార్ పాల్గొన్నారు.

ఇంటింటా సర్వే ప్రణాళిక బద్ధంగా చేపట్టాలి

ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు స్పెషల్ సమ్మరీ రివిజన్ 2025 ఓటర్ల జాబితాకి సంబంధించి డోర్ టు డోర్ సర్వేను బీఎల్‌ఓలు ప్రణాళికాబద్ధంగా, ఎన్నికల సంఘం నిర్దేశిత సూచనల మేరకు చేప ట్టాలని బీఎల్‌ఓలు, సూపర్‌వైజరీ అధికారులను జీఎంసీ కమిషనర్, తూర్పు నియోజకవర్గ ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ అధికారి (ఈఆర్‌ఓ) పీ.శ్రీని వాసులు ఆదేశించారు. శనివారం స్థానిక గుంటూరు వారి తోట, జియావుద్దీన్‌నగర్ ప్రాంతాల్లో బీఎల్‌ఓలు చేపట్టిన డోర్ టు డోర్ ఓటర్ సర్వేని ఆయన ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ బీఎల్‌ఓలు ఓటర్ సర్వే పక్కాగా చేపట్టాలని, తమకు కేటాయించిన ప్రాంతాల్లో నూరు శాతం సర్వే చేయాలన్నారు. ఓటర్ల క్లైమ్స్‌ను రెండు రోజుల్లో పూర్తి చేయాలని, ప్రతి బీఎల్‌ఓ తమ పరిధిలో నూతన ఓటర్లను బీఎల్‌ఓ రిజిస్టర్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. సూపర్వైజరీ అధికారులు కూడా క్షేత్ర స్థాయిలో బీఎల్‌ఓలతో పాటు సర్వే విధులను నేరుగా పరిశీలించాలని అన్నారు. డోర్ నంబర్లను క్షుణ్ణంగా పరి శీలించిన తర్వాతనే నూతన ఓటర్లను చేర్చాలని, నూతన డోర్ నంబర్ల పై ప్లానింగ్ కార్యదర్శులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యంగా ఉండే సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నగర ప్రజలు తమ ఇంటి వద్దకు ఓటర్ సమాచారం కోసం వచ్చే బీఎల్ ఓలకు సహకరించాలని కోరారు. పర్యటనలో సూపర్వైజరీ అధికారులు హయత్ షా వలి, రసూల్, బీఎల్‌ఓ లు పాల్గొన్నారు.

పన్ను చెల్లింపునకు గడువు రెండు రోజులే

2024-25 మొదటి అర్ధ సంవత్సరానికి పన్నుల చెల్లింపునకు ఈ నెలాఖరు వరకే గడువు ఉందని జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 29, 30 వరకు మాత్రమే గడువు ఉందని, పన్ను చెల్లింపదారుల సౌలభ్యం కోసం క్యాష్ కౌంటర్లు ఆదివారం కూడా ఉదయం 10 నుండి రాత్రి 8 గంటల వరకు పని చేస్తాయని పేర్కొన్నారు. నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయం, సర్కిల్ కార్యాలయంలోని క్యాష్ కౌంటర్లలో పన్ను చెల్లించేందుకు ప్రత్యేక క్యాష్ కౌంటర్లు ఏర్పాటు చేశామని తెలిపారు. 29వ తేదీ ఆదివారం సెలవు రోజు అయినప్పటికీ క్యాష్ కౌంటర్లు యథావిధిగా పని చేస్తాయని పేర్కొన్నారు.


సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నసీర్

సీసీ రోడ్డు, డ్రెయిన్ల నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన

గుంటూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): గుంటూరు తూర్పు నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ చూడని అద్భుతమైన అభి వృద్ధి కార్యక్రమాలు చేస్తున్నా మని ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. నియోజకవర్గంలోని హజరత్ జున్ను షాహిద్ నగర్‌లో రూ.43 లక్షల వ్యయంతో సీసీ రోడ్డుకు, కొబ్బరికాయల సాంబయ్య కాలనీలో రూ.43.65 లక్షల వ్యయంతో డ్రెయిన్ల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు పరుగులు తీస్తున్నాయని, జున్నుషాహిద్‌నగర్, కొబ్బరి కాయల సాంబయ్య కాలనీలో రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణ పనులను జనవరి నాటికి పూర్తి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సురే శ్రీనివాసరావు, రాతంశెట్టి జగన్ తదితరులు పాల్గొన్నారు.

లెదర్ ఇండస్ట్రీని అభివృద్ధి పథంలో నడపండి

రాష్ట్రంలోని తోలు పరిశ్రమ అభివృద్ధికి కృషి చేయాలని పిల్లి మాణిక్య రావుకు ఎమ్మెల్యే నసీర్ సూచించారు. లెదర్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా ఇటీవల నియమితులైన మాణిక్యరావును నసీర్ శనివారం సన్మానించారు. చర్మకారుల సమస్యలు పరిష్కరించడంతోపాటు, వారి అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేయాలని ఆయన సూచించారు.

సమసమాజ స్ఫూర్తి ప్రదాత జాషువా : ఎమ్మెల్యే మాధవి



జాషువా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గల్లా మాధవి

గుంటూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): సమ సమాజ స్ఫూర్తి ప్రదాత గుర్రం జాషువా అని గుంటూరు పశ్చిమ నియోజక వర్గ ఎమ్మెల్యే గల్లా మాధవి కొనియాడారు గుర్రం జాషువా జయంతి ని పురస్కరించుకుని శనివారం స్థానిక నగరంపాలెంలోని జాషువా విగ్రహానికి పూల మాలలు వేసి నివాళు లర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సంఘ సంస్క రణే లక్ష్యంగా మహా నీయుడు జాషువా సృష్టించిన సాహిత్యం తెలుగు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటుందని అన్నారు. తెలుగు సాహితీ లోకంలో ఆయన దిగ్గజంలా నిలిచిపోతారన్నారు.

జాషువా కళాపీఠం ఆధ్వర్యంలో..

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 28: స్థానిక జాషువా కళాపీఠం ఆధ్వర్యంలో నగరం పాలెంలోని జాషువా విగ్రహానికి పలు వురు పూల మాలలు వేసి నివాళులర్పించారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్య వర ప్రసాదు, ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావుతో పాటు పలువురు నివాళులర్పించారు. తనివాళులర్పించిన వారిలో జాషువా కళాపీఠం నిర్వా హకుడు పీ.విజయ్‌కుమార్, ప్రముఖ న్యాయవాది వైకే, హైకోర్టు న్యాయ వాది సీహెచ్ శోభారాణి తదితరులు ఉన్నారు.

జాషువా స్వగృహ సందర్శన యాత్ర


జాషువా కుటుంబ సభ్యులతో మాట్లాడతున్న రచయితల సంఘం

గుంటూరు, సెప్టెంబరు 28: గుర్రం జాషువా జయంతి సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం ఆధ్వర్యంలో గుంటూరు నుంచి వినుకొండకు జాషువా స్వగృహ సందర్శన యాత్రను విజయవంతంగా నిర్వహించారు. జాషువా జయంతి సందర్భంగా శని వారం ఉదయం 10 గంటలకు ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం, గుం టూరు జిల్లా రచయితల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో గుంటూరు నుండి సంఘ సభ్యులు వినుకొండలోని జాషువా స్వగృహనికి యాత్రగా వెళ్లి స్వగృహాన్ని సందర్శించారు.గ్రామస్తులతో జాషువా సాహిత్యంపై ముచ్చటించారు. ఈ యాత్రలో ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం అధ్య క్షులు డాక్టర్ సీ. భవానిదేవి, ఉపాధ్యక్షులు కేజే రమేష్, ప్రధాన కార్య దర్శి చల పాక ప్రకాష్, కార్యదర్శి ఎస్. ఎం.సుభాని, కోశాధికారి నానా, సహాయ కార్యదర్శి పీ.సుభాషిణి, సభ్యులు నాగే శ్వరరావు, వశిష్ఠ పాల్గొన్నారు.

భగత్‌సింగ్ ఆశయాలను కొనసాగించాలి

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 28: భగత్‌సింగ్ స్ఫూర్తితో విద్య, ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడతామని ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు స్పష్టం చేశారు. భగత్ సింగ్ 117 జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తపేట మల్లయ్య లింగం భవన్ నుంచి భగత్‌సింగ్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి ఆయన విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పించారు.

గాయకుడు పీవీ రమణకు జాషువా పురస్కారం ప్రదానం


పీవీ రమణకు పురస్కారం అందజేస్తున్న కందుల దుర్గేష్

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 28: కవి, గాయకుడు పీవీ రమణకు జాషువా సాహిత్యానికి చేసిన సేవలకు గుర్తింపుగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పర్యాటక సాంస్కృతిక శాఖ కవికోకిల జాషువా పురస్కారంతో సత్కరించింది. జ్ఞాపిక, శాలువాతో సత్కరించి 50 వేల నగదును అందిం చింది. ఈ మేరకు విజయవాడలో పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జరిగిన కవికోకిల గుర్రం జాషువా 129 జయంతి వేడుకలలో మంత్రి కందుల దుర్గేష్ చేతుల మీదుగా పీవీ రమణ అందుకున్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో సాంస్కృతిక వైభవాన్ని తిరిగి తీసు కొస్తామని కందుల దుర్గేష్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ కృష్ణ జిల్లా కలెక్టర్ సృజన, సాంస్కృతిక శాఖ అదనపు సంచాలకులు శ్రీనివాస్, పూర్వ సంచాలకులు ఆర్.మల్లిఖార్జునరావు, పురస్కార గ్రహీతలు శిఖామణి, ఎజ్రాశాస్త్రి, వరప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రమణకు గుంటూరు నగరానికి చెందిన ప్రముఖులు అభినందనలు తెలిపారు.

పేద విద్యార్థుల ఉపకార వేతనాలకు రూ.6 లక్షల విరాళం


గోరంట్ల పున్నయ్య చౌదరికి చెక్కును అందజేస్తున్న సుశీలాంబ

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 28: కమ్మ జన సేవా సమితి ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు ప్రతి ఏడాది అందజేసే ఉపకార వేతనాల నిధికి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్ కొండూరు సుశీలాంబ రూ. 6 లక్షల విరాళాన్ని ప్రకటించారు. శనివారం సమితి కోశాధికారి గోరంట్ల పున్నయ్య చౌదరికి ఆమె చెక్కును అందజేశారు. అనంతరం సుశీలాంబ మాట్లాడుతూ మహిళ విద్యకు ప్రాధాన్యత ఇస్తున్న కేజేఎస్ఎస్ సేవలు అభినందనీయమన్నారు. గోరంట్ల పున్నయ్య చౌదరి మాట్లాడుతూ నూతనంగా నిర్మిస్తున్న భవనానికి విరాళాలు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో పాలక వర్గ సభ్యుడు పెద్ది సాంబశివరావు, విశ్రాంత రిజిస్ట్రార్ రావెళ్ల సాంబశివరావు, విశ్రాంత ప్రిన్సిపాల్ గడిపూడి వెంకట్రాయుడు తదితరులు పాల్గొన్నారు.

డిక్లరేషన్ ఇష్టం లేక డైవర్షన్ రాజకీయాలు: మన్నవ


గుంటూరు, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): పాప ప్రక్షాళన పేరుతో వైసీపీ నాయకుడు జగన్‌రెడ్డి చేపట్టిన తిరుమల పర్యటనను ఎవరూ అడ్డుకోలేదని, డిక్లరేషన్ ఇవ్వడం ఇష్టం లేక ఆయనే డైవర్షన్ రాజకీయాలకు తెరతీశారని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి మన్నవ మోహనకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. తిరుమల సాక్షిగా తప్పు చేయలేదని జగన్ చెప్పగలరా? అని యన సవాల్ విసిరారు. వైసీపీ హయాంలో కొండపై జరిగిన ప్రతి విషయంపై సిట్ అధికారులు దర్యాప్తు చేయాలని, శ్రీవారి ఆస్తులు, బంగారు నగలపై ఆడిట్ జరపాలని డిమాండ్ చేశారు.

అవగాహన లేమితో ప్రభుత్వ పథకాలకు దూరం

● లీడ్ బ్యాంకు మేనేజర్ మహిపాల్ రెడ్డి


మాట్లాడుతున్న మహిపాల్ రెడ్డి, పాల్గొన్న ప్రజా సంఘాల నాయకులు

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 28: సరైన సమాచారం, అవగాహన లేకపోవడంతో చాలా మంది అర్హులు ప్రభుత్వ పథకాలకు దూరమవు తున్నారని లీడ్ బ్యాంకు మేనేజర్ మహిపాల్‌రెడ్డి అన్నారు. స్థానిక అమరావతి రోడ్డు లోని మదర్ థెరిస్సా కమ్యూనిటీహాల్‌లో శనివారం రాష్ట్రీయ మహా జన సమితి ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన సదస్సు నిర్వహిం చారు. సదస్సుకు సమితి అధ్యక్షుడు కంభం ఆనంద్‌బాబు అధ్యక్షత వహించారు. మహిపాల్‌రెడ్డి మాటాడుతూ జిల్లాలో 40 శాతం మందికి ఇప్పటివరకు బ్యాంకు ఖాతాలు లేవన్నారు. జిల్లా కార్మిక సహాయ కమీషనర్లు డీ.లక్ష్మీ, టీ.అనురాధ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులు విధిగా ఈ శ్రమకార్డును తీసుకోవాలని అన్నారు. హైకోర్టు న్యాయవాది చందవోలు శోభారాణి నాగభూషణం, శ్రీలక్ష్మీ, ప్రశాంతి, రాంబాబు, అమర్ తదితరులు పాల్గొన్నారు.


భక్తి గీతాలను ఆలపిస్తున్న సాయిబాబా శర్మ

అలరించిన భక్తి సంగీత విభావరి


గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 28: స్థానిక గోరంట్ల శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వరరాగ సుధా ఆధ్వర్యంలో జరిగిన భక్తి సంగీత విభావరి ఆకట్టుకుంది. గాయకులు కేవీ సాయిబాబా శర్మ, పీఎల్ నరసింహారావు పలు భక్తి గీతాలు శ్రావ్యంగా ఆలపించారు. కీ బోర్డుపై రామకృష్ణ శర్మ, తబాలపై షణ్ముఖ శర్మ వాయిద్య సహకారం అందించారు. అనంతరం కళాకారులను ఆలయ కమిటీ నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.

అసాంఘిక కార్యకలాపాల కట్టడికి కఠిన వైఖరి

● నేర సమీక్షా సమావేశంలో జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్


మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

గుంటూరు, సెప్టెంబరు 28 : అసాంఘిక కార్యకలాపాల కట్టడికి కఠిన వైఖరి అవలంబించాలని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశించారు. ఈ మేరకు శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రాత్రి గస్తీని మరింత సమర్థవంతంగా నిర్వహించాలని,నైట్ బీట్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని, మొక్కుబడిగా కాకుండా అంకితభావంతో రాత్రి గస్తీ నిర్వహించాలని, జిల్లాలో జైలు నుంచి విడుదలైన వారి వివరాలు సేకరించి సంబంధిత అధికారులతో మాట్లాడి పాతనేరస్తులు, చెడునడత కలిగిన వారిపై నిఘా ఉంచాలని ఆదేశించారు. ముఖ్యంగా రౌడీషీటర్లు, దొంగలు, తీవ్ర నేరాలకు పాల్పడిన వారి కదలికలు, గంజాయి విక్రేతలు, అక్రమ రవాణాదారులపై ప్రత్యేక నిఘా ఉంచి వారి కదలికలను గమనించాలని, జిల్లాలో పెండింగ్‌లో ఉన్న కేసుల విచారణ వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, 2019 సంవత్సరానికి ముందు వున్న పెండింగ్ కేసుల దర్యాప్తు పూర్తి చేయాలని అధి కారులను ఆదేశించారు. సైబర్ నేరాలపై ప్రజలను అప్రమత్తం చేయాలని, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. పోలీసు కార్యాలయంలోని మినిస్టీరియల్ సిబ్బంది సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. గంజాయి, ఎస్సీ ఎస్టీ, మిస్సింగ్ కేసులు, మహిళా సంబంధిత నేరాలు, పోక్సో కేసులు మొదలైన అంశాలపై సమీక్షించారు. గతవారం జరిగిన లోక్‌అదాలత్‌లో రాజీమార్గం ద్వారా ఎక్కువ కేసులు పరిష్కరించిన నల్లపాడు సీఐ వంశీధర్‌ని అభినందిస్తూ నగదు రివార్డు అందించారు. కోర్టులలో పెండింగ్, పాత కేసులలో దర్యాప్తు పూర్తి చేసి నిందితులకు శిక్ష పడేలా చేసిన దర్యాప్తు అధికారులను పిలిపించి వారికి కూడా క్యాష్ రివార్డ్ అందజేశారు. ఉత్తమ ప్రతిభ చూపిన హెడ్ కానిస్టేబుల్స్, కానిస్టేబుల్స్ మొత్తం 53 మందిని అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు. సమా వేశంలో జిల్లా అడిషనల్ ఎస్పీ అడ్మిన్ జి వి రమణ మూర్తి, ఎఆర్ అదనపు ఎస్పీ హనుమంతు, ఈస్ట్ డివిజన్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్, వెస్ట్ డీఎస్పీ జయరామ్‌ప్రసాద్, ట్రాఫిక్ డీఎస్పీ రమేష్ ,తెనాలి డీఎస్పీ జనార్ధన్‌రావు, ఎస్సీ, ఎస్టీ డీఎస్పీ మల్లిఖార్జునరావు పాల్గొన్నారు.






LYCA PRODUCTIONS
OCT. 10
WORLDWIDE RELEASE
SUBASKARAN PRESENTS
SUPERSTAR RAJINIKANTH
వేట్టయన్
ద హంటర్
WRITTEN & DIRECTED BY T. J. GNANAVEL
AN ANIRUDH MUSICAL
PRODUCED BY SUBASKARAN
TAMIL TELUGU HINDI KANNADA


people MEDIA FACTORY
CHITRALAYAM
OCT 11TH
IN CINEMAS WORLDWIDE
MACHO STAR GOPICHAND
A SREENU VAITLA FILM
విశ్వం
TG VISHWA PRASAD VENU DONEPUDI
TELUGU


CULT CONCEPTS
From The Director of
మంత్ర మంగళ
'OSHO' THULASIRAM'S
దక్షిణ
OCTOBER 4TH RELEASE
PRODUCER :
ASHOK SHINDE


PHOENIX GAGA
JOKER FOLIE À DEUX
THE WORLD IS A STAGE
OCTOBER 2nd
WEDNESDAY RELEASE
FILMED FOR IMAX
WARNER BROS.
WARNER BROS. PICTURES RELEASE THROUGH NVR CINEMA - 9966963111


MASSIVE BLOCKBUSTER
MAN OF MASSES NTR
DEVARA
PART 1
KORATALA SIVA
IN CINEMAS NOW


BGM STUDIO
దసరా నవరాత్రుల శుభాకాంక్షలతో
ADITYA MUSIC
OCTOBER 3RD
WORLDWIDE RELEASE
IN THEATRES
చిట్టి పొట్టి
Story, Screenplay, Producer & Director
BHASKAR YADAV DASARI
Music SRI VENKAT Editor BALAKRISHNA BOYA DOP MALHARBHAT JOSHI
Choreography KAPIL Stunts STAR MALLI PRO LAXMI NIVAS


BLOCKBUSTER HIT
ASIAN SURESH
2D ENTERTAINMENT
KARTHI ARVIND SWAMI
సత్యం సుందరం
WRITTEN & DIRECTED BY C. PREMKUMAR
PRODUCED BY JYOTIKA · SURIYA
IN CINEMAS NOW
Co Produced by Rajsekar Karpoorasundarapandian

సీఎం సహాయ నిధికి రూ.50 వేలు విరాళం



మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు చెక్కు అందజేస్తున్న వెంకట సుబ్బారావు

తెనాలి రూరల్, సెప్టెంబరు 28: ముఖ్యమంత్రి సహాయనిధికి విరాళం అందించడం అభినందనీయమని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. శనివారం పట్టణానికి చెందిన విశ్రాంత ఇరిగేషన్ ఇంజినీర్ మందలపు వెంకట సుబ్బారావు మందలపు అహల్య జ్ఞాపకార్థం ముఖ్యమంత్రి సహాయనిధికి మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు రూ.50 వేలు విరాళం చెక్కును అందజేశారు. పార్టీ మండల అధ్యక్షుడు కేసన కోటేశ్వరరావు, పలువురు కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

పెదకాకాని, సెప్టెంబరు 28: పెదకాకాని మల్లేశ్వర స్వామి దేవస్థానంలో దసరా ఉత్సవాల పోస్టర్, కరపత్రాలను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అలయ ఈవో లీలా కుమార్ మాట్లాడుతూ వచ్చే నెల మూడో తారీకు నుంచి దసరా ఉత్సవాలను పెదకాకాని మల్లన్న సన్నిధిలో ప్రారంభిస్తున్నామన్నారు. ఈ ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.

వన్ టౌన్ సీఐ మల్లికార్జునరావుకు ప్రశంసాపత్రం



ప్రశంసాపత్రం అందుకుంటున్న సీఐ మల్లికార్జునరావు

తెనాలి క్రైం, సెప్టెంబరు 28: కేసుల పరిష్కారంలో అత్యంత ప్రతిభ కనబరిచిన వన్ టౌన్ సీఐ వి.మల్లికార్జునరావుకి శనివారం జిల్లా ఎస్పీ శరత్‌కుమార్ ప్రశంసాపత్రం అందించి ప్రత్యేకంగా అభినందించారు. 2020లో తాడేపల్లి పోలీస్ స్టేషన్ సీఐగా పని చేస్తున్న సమయంలో రేప్ కేసులో నిందితుడిని పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచి నేరస్తునికి 20 ఏళ్ల జైలు శిక్ష పడే విధంగా కేసును ప్రతిష్టాత్మకంగా నడిపిన తీరు, అదే విధంగా తెనాలి కోర్టులో జరిగిన లోక్ అదాలత్‌లో అత్యధికంగా 29 కేసులు పరిష్కారానికి కృషి చేయడంతో ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ఇదేస్టేషన్‌కి చెందిన కోర్టు కానిస్టేబుల్ కోటి వృత్తిపరంగా వివిధ కేసుల్లో చూపిన ప్రతిభను ఎస్పీ అభినందించారు.

కొల్లిపర ఎస్ఐ కోటేశ్వరరావు...



ఎస్పీ నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న కోటేశ్వరరావు

తెనాలి రూరల్, సెప్టెంబరు 28: తెనాలి రూరల్ ఎస్ఐగా పని చేస్తూ భారీ వర్షాల సమయంలో కొల్లిపర మండలం ముంపు ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తూ సాహసోపేతంగా ప్రజలకు రక్షణ కల్పించినందుకు ప్రస్తుత కొల్లిపర ఎస్ఐ కోటేశ్వరరావుకు ప్రశంసాపత్రం లభించింది. శనివారం ఎస్పీ సతీష్‌కుమార్ ఎస్ఐ కోటేశ్వరరావును అభినందించి ఆయన చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందించారు. వరద ఉద్ధృతికి నదిలో చిక్కుకున్న సుమారు 700 గొర్రెలు, ఆరుగురు కాపరులను సురక్షితంగా ఒడ్డుకు చేర్చి ప్రాణ నష్టం జరగకుండా సకాలంలో స్పందించారు. ముంపుప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తూ పునరావాస కేంద్రాలకు తరలించి ఎక్కడా ప్రాణనష్టం జరగకుండా బాధ్యతగా మెలిగారు. ఆయన సేవలను గుర్తించిన ప్రభుత్వం ప్రశంసాపత్రం అందించింది. పలువురు పోలీస్ అధికారులు, సిబ్బంది కోటేశ్వరరావుకు అభినందనలు తెలిపారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి

కొల్లిపర, సెప్టెంబరు 28: లబ్ధిదారులు గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని హౌసింగ్ ఏఈ సుబ్బారావు అన్నారు. శనివారం మండల పరిధిలోని గ్రామాల్లో అధికారులు 'మన ఇల్లు.. మన గౌరవం' కార్యక్రమాన్ని నిర్వహించారు. అధికారులు గృహ నిర్మాణాలపై లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వల్లభాపురంలో జరిగిన సమావేశంలో ఏఈ మాట్లాడుతూ గృహ నిర్మాణాలను పూర్తి చేసిన వెంటనే నగదును బ్యాంకులో జమ చేయనున్నట్లు తెలిపారు. ఎంపీడీవో విజయలక్ష్మి మాట్లాడుతూ గృహ నిర్మాణాలను మార్చి 30వ తేదీలోపు పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ పూర్ణశంకరరావు, దుగ్గిరాల మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ వంగా సాంబిరెడ్డి, హౌసింగ్ అధికారులు, సచివాలయం సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో కూడిన విద్యను బోధించాలి

కొల్లిపర, సెప్టెంబరు 28 : ఉపాధ్యాయులు విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను బోధించాలని ఎంఈవో సాల్మన్‌రాజు అన్నారు. శనివారం మండల పరిధిలోని తూములూరు, దావులూరు, కొల్లిపర గ్రామాల్లో ప్రాథమిక పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి ఉపాధ్యాయులకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా సాల్మన్‌రాజు మాట్లాడుతూ ఉపాధ్యాయులు పాఠశాలల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. బడి మానివేసిన పిల్లలను బడిలో చేర్పించటానికి తమ వంతు కృషి చేయాలన్నారు. మధ్యాహ్న భోజనం పట్ల ప్రధానోపాధ్యాయులు తగిన శ్రద్ధ తీసుకోవాలన్నారు.

దంత వైద్య శిబిరానికి విశేష స్పందన

తెనాలి అర్బన్, సెప్టెంబరు 28 : పట్టణంలోని ఎన్ఆర్‌కే కేఎస్ఆర్ గుప్తా డిగ్రీ కళాశాలలో శనివారం దంత వైద్య శిబిరం నిర్వహించారు. శివ డెంటల్ క్లీనిక్ వైద్యురాలు హరిప్రియ బృందం విద్యార్థులకు దంత పరీక్షలు చేశారు. టూత్ పేస్ట్, బ్రష్‌లు ఉచితంగా అందజేశారు. దంత సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ప్రిన్సిపల్ గోగినేని విజయకృష్ణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

కొలకలూరులో...

తెనాలి రూరల్, సెప్టెంబరు 28: మండలంలోని కొలకలూరులో డోనర్ ఫర్ పూర్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆంధ్రప్రైమ్ సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ సహకారంతో ఉచిత మెగా వైద్య శిబిరం శనివారం నిర్వహించారు. డాక్టర్ అచింశెట్టి అన్వేష్, డాక్టర్ కాసుల సాయిరాజశేఖర్, జి.తేజస్వీ, డాక్టర్ బడుగు పవన్ వివిధ అనారోగ్య సమస్యలతో శిబిరానికి వచ్చిన రోగులకు వైద్య పరీక్షలు జరిపి ఉచితంగా మందులు అందించారు. గ్రామ సర్పంచి చొప్పర ప్రీతి, మండల తహసీల్దార్ గోపాలకృష్ణ రిబ్బన్ కట్ చేసి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. నలుకుర్తి సురేష్, రవికిరణ్, ఎస్.దేవరాజ్, రవికుమార్, సీనియర్ జర్నలిస్ట్ ఎం.వెంకటేశ్వరరావు, వినయ్‌కుమార్, మురళిధర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నైపుణ్య శిక్షణ

తెనాలి అర్బన్, సెప్టెంబరు 28: గుప్తా డిగ్రీ కళాశాలలో శనివారం విద్యార్థులకు నైపుణ్య శిక్షణ ఇచ్చారు. అమరావతిలోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీ ఆఫ్ ఇండియా ప్రతినిధులు విజయ్‌కుమార్, సిద్ధార్థ విద్యార్థులకు పలు నైపుణ్యాలపై శిక్షణ ఇచ్చారు. పోటీ ప్రపంచంలో ఉపాధి అవకాశాల సాధనకు అవసరమైన సంసిద్ధతను విద్యార్థుల్లో ఉండాల్సిన విధివిధానాలను వివరించారు.

ఉపాధ్యాయ సమస్యలపై యూటీఎఫ్ పోరాటం



ఉపాధ్యాయులను సన్మానించిన ఎమ్మెల్సీ లక్ష్మణరావు

పొన్నూరుటౌన్, సెప్టెంబరు 28: ఉపాధ్యాయ సమస్యలపై యూటీఎఫ్ నిరంతరం పోరాడుతుందని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. చేబ్రోలు యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభ శనివారం జరిగింది. ఈ సందర్భంగా యూటీఎఫ్ పోరాటాలను మననం చేసుకున్నారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి ఎక్సలెన్స్ అవార్డులను ప్రదానం చేశారు. నూతన కమిటీ ఎన్నిక జరిగింది. అధ్యక్ష కార్యదర్శులుగా కె.విజయరాజు, పి.పార్థసారథి ఎన్నికైయ్యారు.

వ్యాసరచన పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చూపిన నారాకోడూరు విద్యార్థులు

చేబ్రోలు, సెప్టెంబరు 28: స్వర్ణాంధ్రప్రదేశ్ 2047 అంశంపై జరిగిన మండల స్థాయి వ్యాసరచన పోటీల్లో నారాకోడూరు జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపినట్లు ఎంఈవో ఏవీహెచ్ ప్రసాద్ తెలిపారు. విద్యార్థుల అభినందన కార్యక్రమం శనివారం పాఠశాలలో జరిగింది. పాఠశాలకు చెందిన షేక్ నజ్మా ప్రథమ స్థానం, వి.మాధురి ద్వితీయ స్థానం, దాసరి ధరణి తృతీయ స్థానం సాధించినట్లు చెప్పారు. డిబెట్‌లో వేజండ్లకు చెందిన షేక్ ఆఫ్రీన్ ప్రథమ, ఎం.లహరి, డి ధరణి ద్వితీయ స్థానం సాధించినట్లు చెప్పారు. విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.ఏడుకొండలు, పి.రాజ్యలక్ష్మి, కోటి పద్మ అభినందించారు.

బ్రిటీష్ నటి మ్యాగీస్మిత్ మృతికి సంతాపం

తెనాలి అర్బన్, సెప్టెంబరు 28 : ప్రముఖ బ్రిటీష్ నటి, ఆస్కార్ గ్రహీత మ్యాగీస్మిత్ మృతి పట్ల మా ఏపీ సంతాపం తెలిపింది. హ్యారీపోటర్ చిత్రంలో విశేష నటన కనబరిచిన ఆమెకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు లభించిందని, సినీ దర్శకుడు దిలీప్‌రాజా శనివారం జరిగిన కార్యక్రమంలో చెప్పారు. షేక్ స్పియర్ నాటకాలు, సినిమాలు, టీవీ షోలలో నటించి ప్రపంచాన్ని తన వైపునకు తిప్పుకున్న గొప్ప నటి అని చెప్పారు.

సామాజిక ప్రయోజనాలే లక్ష్యంగా జాషువా రచనలు

● జాషువా జయంతి సందర్భంగా నివాళులర్పించిన ప్రముఖులు



జాషువా విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బీసీ నాయకులు



లుంబిని వనంలో గుర్రం జాషువాకు నివాళులర్పిస్తున్న దళిత మహాసభ నాయకులు

తెనాలి అర్బన్, సెప్టెంబరు 28: సామాజిక ప్రయోజనమే లక్ష్యంగా, పేదల జీవితాలు మెరుగు పడేలా జాషువా రచనలు చేశారని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేసన శంకరరావు చెప్పారు. నవయుగ కవి గుర్రం జాషువా జయంతి పురస్కరించుకుని బస్‌స్టేషన్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విశ్వ మానవ కల్యాణానికి తన కవిత్వాన్ని అంకితం చేశారని, ఆధునిక తెలుగు కవుల్లో విశిష్ట స్థానం సాధించారని చెప్పారు. కవిత్వాన్ని ఆయుధంగా చేసుకుని సమాజంలో నెలకొన్న మూఢ నమ్మకాలు, అసమానతలపై పోరాటం చేశారని, ఛీత్కారం ఎదురైన చోట సత్కారం పొందారని చెప్పారు. జొన్నాదుల వెంకటేశ్వరరావు, కుర్రా శ్రీను, వెంకటసాయి, పవన్, మణికంఠ పాల్గొన్నారు. గుర్రం జాషువా విజ్ఞాన సమితి ఆధ్వర్యంలో నివాళులర్పించారు. పినపాడు రవికుమార్, బొల్లిముంత కృష్ణ, రాజారావు, రత్నం, లక్ష్మణరావు, శ్యామ్, రాజగోపాల్, ప్రేమ్‌కుమార్, ఆళ్లమూడి ప్రభాకర్, శరత్, వెంకయ్య, ప్రసాదరావు, మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పొన్నూరులో..

పొన్నూరుటౌన్, సెప్టెంబరు 28: గుర్రం జాషువా విశ్వజనీయమైన కవి అని దళిత మహాసభ వ్యవస్థాపకులు డాక్టర్ కత్తి పద్మారావు అన్నారు. పట్టణంలోని లుంబిని వనంలో కవి చక్రవర్తి గుర్రం జాషువా జయంతి వేడుకలు శనివారం జరిగాయి. గుర్రం జాషువా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గుర్రం జాషువా రచనల ద్వారా సమాజ చైతన్యానికి చేసిన సేవలను కొనియాడారు. అలాగే కులాంతర వివాహాల వేదికలు ప్రతి మండలంలో ఏర్పాటు చేసి గుర్రం జాషువా పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. గుర్రం జాషువా రచనలు నేటి తరం తప్పనిసరిగా చదవాలని సూచించారు. కార్యక్రమంలో వేము మాధవ్, గేర ప్రశ్నకుమారి, జి.శాంతి, దాసరి శ్యామలా, ఎన్.సుబ్బారావు, జొన్నలగడ్డ రాణి తదితరులు పాల్గొన్నారు.

జాషువా రచనలు సమాజ స్థితిగతులకు నిదర్శనాలు

తెనాలి రూరల్, సెప్టెంబరు 28: గుర్రం జాషువా రచనలు అప్పటి సమాజ స్థితిగతులకు నిలువెత్తు నిదర్శనాలని కొలకలూరు గ్రంథాలయాధికారిణి కడియాల సుజాత అన్నారు. శనివారం మహాకవి గుర్రం జాషువా జయంతిని పురస్కరించుకుని కొలకలూరు శాఖ గ్రంథాలయంలో విద్యార్థులతో కలిసి జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. సీహెచ్ వెంకటేశ్వర్లు, పలువురు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



గుర్రం జాషువా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న లైబ్రేరియన్ సుజాత, వెంకటేశ్వర్లు, విద్యార్థులు

పరిసరాల పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం



విద్యార్థులకు స్వచ్ఛతపై అవగాహన కల్పిస్తున్న పట్టణ చైర్‌పర్సన్ రాధిక, కౌన్సిలర్ మానసారెడ్డి

తెనాలి, మారీసుపేట సెప్టెంబరు 28: పరిసరాల పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యాన్ని సాధించవచ్చుని పట్టణ పురపాలక సంఘ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పిలుపునిచ్చారు. చెంచుపేటలోని 31వ, 32వ వార్డులో శనివారం స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్ పర్సన్ రాధిక, కమిషనర్ బండి శేషన్నలు ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ రాధిక మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన స్వచ్ఛతా హి సేవా 2024లో భాగంగా పట్టణంలో ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వార్డు ప్రజలు తమ ఇంటి పరిసరాలతోపాటు వార్డును కూడా పరిశుభ్రంగా ఉంచాలని కోరారు. వార్డుల పరిశుభ్రతతో సంపూర్ణ స్వచ్ఛారోగ్య తెనాలిని సాధించవచ్చన్నారు. విద్యార్థులతో కలిసి మొక్కలను నాటారు. కమిషనర్ శేషన్న మాట్లాడుతూ స్వచ్ఛ భారత్ మిషన్ ఆదేశాలతో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశాలతో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాల్లో భాగంగా ప్రత్యేక పారిశుద్ధ్య పనులు, చెట్లను నాటడం చేస్తున్నామని తెలిపారు. పుర ప్రజల భాగస్వామ్యంలో సుందర తెనాలిని నిర్మిద్దామని పిలుపునిచ్చారు. మురుగు కాలువలో చెత్తను, వ్యర్థాలను వేయరాదని, పరిసరాల పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యాన్ని సాధించవచ్చాన్నారు. కోగంటి శివయ్య పురపాలక ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్వచ్ఛతా హి సేవాపై అవగాహన కల్పించారు. విద్యార్థులతో కలసి స్వచ్ఛత ప్రతిజ్ఞను చేశారు. అనంతరం 36వ వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య కార్యక్రమాలను పర్యవేక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు. మున్సిపల్ హెల్త్ అధికారి డాక్టర్ ఎలెన్ నిర్మల, పలువురు కౌన్సిలర్ మున్సిపల్ అధికారులు, సచివాయల సిబ్బంది పాల్గొన్నారు.

ఆదర్శనీయుడు భగత్‌సింగ్

తెనాలి, మారీసుపేట సెప్టెంబరు 28: భారత స్వాతంత్ర సమరయోధుడు, ఉద్యమకారుడు భగత్‌సింగ్ యువతకు ఆదర్శనీయుడని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పాశం వెంకటేష్ అన్నాడు. స్థానిక శివాజీచౌక్‌లో శనివారం భారత స్వాతంత్ర సమరయోధుడు భగత్‌సింగ్ 117వ జయంతి ఉత్సవాలను ఏఐఎస్ఎఫ్ నాయకులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ పాల్గొని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఐ పట్టణ కార్యదర్శి మద్దినేని కిరణ్‌బాబు, ఏఐఎస్ఎఫ్ తెనాలి నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శిలు గండు శివ, చెన్నూరి సాయి, నియోజకవర్గ అధ్యక్షుడు కె.రవితేజ, వావేటి వేణు, యశ్వంత్, వివేక్, పండు, అన్నం సాయి, యువజన పార్టీ, మహిళ సంఘాల నేతలు పాల్గొన్నారు.

గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు కేంద్రం

తెనాలి, మారీసుపేట సెప్టెంబరు 28: గంగానమ్మపేటలోని వైశ్య విద్యానిధి హాస్టల్ ఆవరణలో శనివారం గ్రాడ్యుయేట్స్ ఓటరు నమోదు కేంద్రంను శ్రీకన్యాకపరమేశ్వరి వైశ్యవిద్యానిధి కమిటీ వారు ఏర్పాటు చాశారు. ఈ సందర్భంగా కమిటీ కార్యదర్శి, పురపాలక సంఘ మాజీ చైర్మన్ పెండేల వెంకట్రావు మాట్లాడుతూ గ్రాడ్యుయేట్స్ ఎంమ్మెల్సీ ఎన్నిక కొరకు ఓటరు నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, డిగ్రీ చదివిన విద్యార్థులు ఓటరుగా నమోదు చేసుకోవచ్చుని తెలిపారు. అనంతరం కరపత్రాన్ని ఆవిష్కరించారు. కమిటీ అధ్యక్షుడు సుగ్గుల వెంకటప్పయ్య, లీగల్ అడ్వైజర్ మద్ది మల్లికార్జునరావు, ఉపాధ్యక్షుడు బచ్చు సాంబశివరావు, సహాయ కార్యదర్శి తాతా శ్రీనివాసరావు, సభ్యులు చుండూరి నాగ మల్లికార్జునరావు, వెల్లంపల్లి సత్యనారాయణమూర్తి, నిమానూరి వెంకటరత్నం, భాస్కర వెంకటసుధీర్, శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

అఖండ గోవిందనామ జపయజ్ఞం

తెనాలి అర్బన్, సెప్టెంబరు 28: తిరుమల లడ్డూ సంప్రోక్షణ కోరుతూ శనివారం అఖండ గోవిందనామ జపయజ్ఞం నిర్వహించారు. తెనాలి నూకల రామకోటేశ్వరరావు కల్యాణ మండపంలో ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు జపయజ్ఞం నిర్విరామంగా నిర్వహించారు. శ్రీప్రజ్ఞానంద సరస్వతి ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో భక్తులు గోవింద నామం ఆలపించారు. టీటీడీ దాససాహిత్య ప్రాజెక్టు భజన బృందాలు, పట్టణంలోని భక్తులు యజ్ఞంలో పాల్గొన్నారు. స్వామిజీ మాట్లాడుతూ లడ్డూ తయారీలో కల్తీ జరగడం భక్తుల మనసును కలిచి వేసిందని అన్నారు. జపయజ్ఞం చేసి సంప్రోక్షణ చేపట్టామన్నారు. శ్రీసాలిగ్రామ మఠం ట్రస్ట్ నూతన కార్యవర్గాన్ని స్వామిజీ ప్రకటించారు. ట్రస్ట్ అధ్యక్షునిగా నంబూరు వెంకటకృష్ణమూర్తి, కార్యదర్శిగా రావూరి సుబ్బారావు, సలహా మండలి చైర్మన్‌గా కొత్త సుబ్రహ్మణ్యం, సాంస్కృతిక విభాగం చైర్మన్‌గా గడ్డిపాటి శ్రీనివాసరావులను ఎంపిక చేసినట్లు తెలిపారు.

దొరికిన పర్సును తిరిగి అప్పగించిన రైల్వే సిబ్బంది

తెనాలి క్రైం, సెప్టెంబరు 28: ఆర్‌పీఎఫ్ ఎస్ఐ జి.వెంకటాద్రి తెలిపిన వివరాల మేరకు రామలింగేశ్వరపేటకు చెందిన ఏవీ సుబ్రహ్మణ్యం గత బుధవారం నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్ ఎక్కాడు. కుటుంబ సభ్యులతో కలిసి 3వ ప్లాట్‌ఫారంపై నుంచి ట్రైన్ ఎక్కే సమయంలో తన పర్సు పోగొట్టుకున్నాడు. ఆ పర్సును హౌస్ కీపింగ్ అసిస్టెంట్ ఎన్.లలిత గుర్తించి వెంటనే అధికారులకు అప్పగించింది. హెల్త్ ఆఫీసర్ ఆ పర్సును పరిశీలించగా అందులో రూ.20,080 నగదు, బ్యాంక్ కార్డులు ఉండటం గుర్తించి వెంటనే దానిని తనకు అప్పగించినట్లు ఎస్ఐ వెంకటాద్రి తెలిపారు. పర్సులో లభించిన ఫోన్ నంబర్లు ఆధారంగా సుబ్రహ్మణ్యంగా గుర్తించి విచారణ అనంతరం అతనికి నగదు, బ్యాంకు కార్డులు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

మోహనరావు, నిర్మలాదేవికి బోయపాటి గురుపీఠ పురస్కారాలు



మోహనరావు (ఫైల్‌ఫొటో)



నిర్మలాదేవి (ఫైల్‌ఫొటో)

తెనాలి అర్బన్, సెప్టెంబరు 28 : సుప్రసిద్ధ హిందీ ఆచార్యులు మోహనరావు, నిర్మలాదేవిలను బోయపాటి గురుదంపతుల హిందీ ప్రచార గురుపీఠ పురస్కారానికి ఎంపిక చేశారు. నాజరుపేటలోని హిందీ ప్రేమీ మండలిలో బోయపాటి నాగేశ్వరరావు, సుభద్రాదేవి స్థాపించి కార్యదీక్ష దక్షతతో హిందీ బోధన గావిస్తున్నారు. గాంధీ జయంతి పురస్కరించుకుని అక్టోబరు 2న ఈ పురస్కారాలను ప్రదానం చేయనున్నారు. 22వ గురుపీఠ పురస్కారాలకు ఏలూరు సీఆర్‌రెడ్డి కళాశాల విశ్రాంత హిందీ ఆచార్యుడు కొల్లి మోహనరావు, విశాఖపట్నం నేవి చిల్డ్రన్ స్కూల్ హిందీ సీనియర్ టీచర్ చిట్టెళ్ల నిర్మలాదేవిని ఎంపిక చేశారు. హిందీ సాహిత్యం, భాష, నాటక రంగంలో ప్రసిద్ధి పొందిన మోహనరావు కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ, ఆచార్య చతుర్‌సేన్ శాస్త్రి నవలల్లో సామాజిక దృక్పథం-తులనాత్మక పరిశీలన అనే అంశంపై పరిశోధన వ్యాసం సమర్పించి పట్టా పొందారు. ఆకాశవాణిలో పలు హిందీ కార్యక్రమాలను రూపొందించి ప్రసారం చేశారు. భారతీయ భాషా సాహిత్యాలపై గాంధీవాద ప్రభావం అనే అంశంపై పలు సెమినార్లు నిర్వహించిన ఆయన ప్రావీణ్యాన్ని గుర్తించి ఈ పురస్కారానికి ఎంపిక చేశారు. తనతో పాటు జీవిత భాగస్వామి, పిల్లలు కూడా హిందీ బోధనామార్గంలో కొనసాగడం మరో పురస్కార గ్రహీత నిర్మలాదేవి ప్రత్యేకత. తిరుమల సాలకట్ల బ్రహ్మోత్సవాలలో 8 రోజులు స్వామి వారి వాహనాల ప్రత్యక్ష వ్యాఖ్యానాన్ని సప్తగిరి ఛానల్‌లో తెలుగు, హిందీ భాషలలో చెప్పారు. ఆమె భాషా ప్రతిభను గుర్తించి ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు కమిటీ అధ్యక్షుడు పాటిబండ్ల దక్షిణామూర్తి, కార్యదర్శి శ్రీనివాసరావు తెలిపారు.

సనాతన ధర్మాన్ని కాపాడండి

తెనాలి, మారీసుపేట సెప్టెంబరు 28: సనాతన ధర్మాన్ని ప్రతి హిందువు కాపాడాలని, ఆ ధర్మం మనల్ని రక్షిస్తుందని కుమార్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ అధినేత కొత్త సుబ్రహ్మణ్యం అన్నారు. స్థానిక నూకల రామకోటేశ్వరావు కల్యాణ మండపంలో శనివారం శాలిగ్రామ మఠం ట్రస్ట్ ఆధ్వర్యంలో పుజ్యశ్రీ బాలస్వామి స్వయం పర్యవేక్షణలో గోవిందనామ సంకీర్తన జప యజ్ఞాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏకాదశి సందర్భంగా ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఈ యజ్ఞం నిర్వహించామని అన్నారు. అనంతరం శాలిగ్రామ మఠం ట్రస్ట్ నూతన కార్యవర్గ సభ్యులతో ప్రయాణ స్వీకారం చేయించారు. ట్రస్ట్ సలహా మండలి చైర్మన్‌గా కుమార్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ అధినేత కొత్త సుబ్రహ్మణ్యం, ట్రస్ట్ చైర్మన్ నంబూరి వెంకట కృష్ణమూర్తి, కార్యదర్శిగా రావూరి సుబ్బారావు, కోశాధికారి గోపు రామకృష్ణ, కార్యవర్గ సభ్యులుగా ముద్దాభక్తుని రమణయ్య, లోకనాథం, రాజేశ్వరావు, మానేపల్లి శివ, వక్కలగడ్డ రామమోహనరావు, కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. తిరుమల తిరపత దేవస్థానం కృష్ణా, గుంటూరు జిల్లాల దాస సాహిత్య ప్రాజెక్ట్ అధ్యక్షుడు గడ్డిపాటి శ్రీనివాసరావు, పట్టణ పరిసర ప్రాంత భక్తులు పాల్గొన్నారు.

మహిళల రక్షణకు చట్టాలను కఠినతరం

తెనాలి, మారీసుపేట సెప్టెంబరు 28: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల రక్షణకై చట్టాలను కఠినతరం చేయాలని డాక్టర్ శారద అన్నారు. స్థానిక చెంచుపేటలోని జేఎంజే కళాశాలలో శనివారం ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ, రెడ్ రిబ్బన్ క్లబ్ వారు మహిళలపై హింస అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ షైనీ ఆధ్వర్యంలో ముఖ్య అతిథిగా డాక్టర్ శారద పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫెడరేషన్ ఆఫ్ అబ్స్టెట్రిక్ అండ్ గైనకాలజికల్ సొసైటీ ఆఫ్ ఇండియా ప్రాముఖ్యతను వివరిస్తూ, గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌లపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. చిన్న పిల్లల నుంచి మహిళల వరకు ఎలాంటి లైంగిక వేధింపులకు గురికాకుండా ఉండడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపారు. చిన్న పిల్లలు, మహిళలు లైంగిక వేధింపుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రిన్సిపాల్ సిస్టర్ షైనీ మాట్లాడుతూ గృహ హింసలు, స్త్రీలపై అత్యాచారాలు, లైంగిక వేధింపులు రోజురోజుకు పెరిగి పోతున్నాయని, వాటిని ఎదుర్కోవడానికి మనం సంసిద్ధులై ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అరుణ జ్యోతి, డాక్టర్ నిర్మల జ్యోతి, రెడ్ రిబ్బన్ క్లబ్ కన్వీనర్‌లు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

వైకుంఠపురం గుడిని ప్రక్షాళన చేయండి

తెనాలి, సెప్టెంబర్ 28, (ఆంధ్రజ్యోతి): మంత్రి గారూ... వైకుంఠపురం ఆలయం కొన్ని సంఘటనలతో అపవిత్రమవుతోంది. దయచేసి ఆలయాన్ని ప్రక్షాళన చేయండంటూ మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ విజ్ఞప్తి చేశారు. తిరుపతి వెంకన్న ఆలయ లడ్డూ విషయంపై వైసీపీ అధిష్ఠానం పిలుపు మేరకు వైకుంఠపురం శ్రీలక్ష్మీపద్మావతీ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం పూజలు చేసేందుకు తమ పార్టీ కార్యకర్తలు, నాయకులతో కలసి వచ్చారు. ఆలయంలో పూజలు చేసిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. తాను ప్రస్తుతం నూతన ప్రభుత్వంపై రాజకీయ విమర్శలు చేయనని, ఏ ప్రభుత్వం వచ్చినా వారిచ్చిన హామీలు నెరవేర్చటానికి కనీసం ఆర్నెల్లు సమయం పడుతుందన్న ఆలోచనతో తాను రాజకీయ విమర్శలు చేయటంలేదన్నారు. అయితే ఆలయంలో జరుగుతున్న అంశాలపై మాత్రమే మాట్లాడతానంటూ ఆలయ ప్రాంగణంలో ప్రక్షాళన అవసరమన్నారు. సంవత్సరం క్రితం తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ప్రధాన అర్చకుడిగా ఉన్న వ్యక్తి ఆలయంలోకి మద్యం తాగి వచ్చాడన్న విషయం తెలిసి ఈవో సస్పెండ్ చేసేందుకు సిద్ధ పడితే, వారు నా దగ్గరకు వచ్చి మరోసారి పొరపాటు జరగనివ్వనని బతిమాలటంతో అతనిని ప్రధాన అర్చకుడిగా కాకుండా ఆలయంలో ఇతర పనులకు వినియోగించాలని సూచించానన్నారు. ఇటీవల రాష్ట్ర మంత్రి మనోహర్ తిరుపతి లడ్డూ వ్యవహారంలో ఆలయంలో మహాయజ్ఞం చేశారని, ఆ యజ్ఞం ఆరోజు ఆలయాన్ని అపవిత్రం చేసిన అర్చకునితో చేయించారని, అటువంటి వ్యక్తితో చేయిస్తే అదికూడా అపవిత్రం అవుతుందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక అతనిని మళ్లీ ప్రధాన అర్చకునిగా చేయటం ఆశ్చర్యం కలిగించిందన్నారు. సస్పెండ్ చెయ్యాల్సిన వ్యక్తిని నేను కాపాడటం ఒక తప్పయితే, మీరు ఏకంగా ప్రధాన అర్చకునిగా చేయించి మరో పొరపాటు చేస్తున్నారని, దానిని సరిచేసుకోవాలన్నారు. ఇది కేవలం నా విజ్ఞప్తి మాత్రమేనని, ఆరోపణలు, విమర్శలు కాదన్నారు. కేశకండనశాలలో ఉద్యోగం చెయ్యాల్సిన ఇద్దరు వ్యక్తులు మీడియా పేరుచెప్పి ఈవోను, సిబ్బందిని బెదిరిస్తూ విధులకు హాజరు కాకుండా ఆలయంలో జీతాలు తీసుకోవటం ఎంతవరకు సబబో ఆలోచించాలన్నారు.

తక్షణమే గృహ నిర్మాణాలు పూర్తి చేసుకోవాలి

పొన్నూరుటౌన్, సెప్టెంబరు 28: రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన నివేశన స్థలాల్లో లబ్ధిదారులు తక్షణమే గృహ నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్ బాబు సూచించారు. పొన్నూరు పట్టణంలోని నిడుబ్రోలులో టిడ్కో గృహ సముదాయాల వద్ద మన ఇల్లు, మన గౌరవం గ్రామసభ జరిగింది. సమీపంలోని నివేశన స్థలాల లబ్ధిదారులతో అవగాహన సదస్సు నిర్వహించారు. సమావేశంలో కమిషనర్ రమేష్ బాబు మాట్లాడుతూ అమృత్ పథకం కింద లబ్ధిదారులు మార్చి 31వ తేదీలోగా గృహ నిర్మాణాలు పూర్తి చేసుకోవాలన్నారు. కాలనీలో ప్రజలకు అవసరమైన అన్ని సదుపాయాలను కల్పించనునట్లు చెప్పారు. ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ ఆదేశాల మేరకు లబ్ధిదారు సమస్యలను అడిగి తెలుసుకుని వాటిని తక్షణమే పరిష్కరించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ అధికారులు, మున్సిపల్ సిబ్బంది, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

పుణ్యక్షేత్రాల పవిత్రతను కాపాడటమే కూటమి ప్రభుత్వ లక్ష్యం



శాంతి హోమానికి హాజరైన కూటమి పార్టీల నాయకులు

పొన్నూరుటౌన్, సెప్టెంబరు 28: పుణ్యక్షేత్రాల పవిత్రతను కాపాడటమే కూటమి ప్రభుత్వ లక్ష్యం అని జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు అన్నారు. కూటమి పార్టీల ఆధ్వర్యంలో శనివారం శ్రీవీరాంజనేయ స్వామి ఆలయంలో ప్రాయిశ్చిత పూజలు, శాంతి హోమం జరిగాయి. ఈ సందర్భంగా కూటమి పార్టీల నాయకులు శ్రీవీరాంజనేయ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో జరిగిన శాంతి హోమంలో పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గాదె వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విభిన్న మతాలు, సంస్కృతి మేళవింపే భారతదేశం అన్నారు. ప్రపంచ ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రమైన తిరుమలలో అపచారం జరిగిందని, బహిర్గతమైన నాటి నుంచి కోట్లాది మంది భక్తులు తీవ్ర ఆవేదనలో ఉన్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో లడ్డూ నాణ్యత విషయంలో తప్పు జరిగి ఉంటే ప్రజలకు క్షమాపణ చెప్పాల్సిన బాధ్యత గత ప్రభుత్వ పెద్దలదేనన్నారు. అన్యమతస్తులు దర్శించుకోవాలంటే డిక్లరేషన్ తప్పనిసరిని చట్టం చెబుతుందన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు బోని పార్వతి నాయుడు, టీడీపీ నాయకులు పఠాన్ అహ్మద్ ఖాన్, పఠాన్ ఫిరోజ్ ఖాన్, బీజేపీ నాయకులు పరాశరం రంగవల్లీ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో రాజకీయ ధర్నాపై పోలీసులకు ఫిర్యాదు



పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నాయకులు

పొన్నూరుటౌన్, సెప్టెంబరు 28: దేవాలయంలో రాజకీయ విషయపరమైన ధర్నా నిర్వహించి భక్తుల మనోభావాలతో వైసీపీ ఆటలాడుకుంటుందని పట్టణ ఎస్సీ సెల్ నాయకుడు తోటకూర నరేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం వైసీపీ నాయకులపై అర్బన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పట్టణంలోని సహస్రలింగేశ్వర స్వామి దేవస్థాన ప్రాంగణంలో ఉన్న స్వర్ణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో వైసీపీ నాయకులు అసాంఘిక శక్తులతో కలిసి ధర్నా నిర్వహించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అంబటి మురళీకృష్ణ సామూహికంగా ఏర్పడి ధర్నా నిర్వహించారని తెలిపారు. ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడుకు గుణపాఠం నేర్పాలని వేంకటేశ్వర స్వామి మూల విరాట్ వద్ద పూజలు నిర్వహించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అంతేకాకుండా ఆలయం ముందు బైఠాయించి భక్తులు లోపలికి వెళ్లకుండా రాకపోకలకు ఆటంకం కలిగించారని, భక్తుల మనోభావాలతో ఆటలాడుతున్న వైసీపీ నాయకులపై కఠిన చర్యలు తీసుకోవాలని అర్బన్ సీఐ రవి కిరణ్‌కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

మానసిక ఒత్తిడిని ఎదుర్కొనేందుకే యంగ్ తరంగ్

తెనాలి అర్బన్, సెప్టెంబరు 28: కళాశాలల్లో విద్యార్థులు మానసిక ఒత్తిడిని ఎదుర్కొని ఉల్లాసాన్ని ఇచ్చేందుకు యంగ్ తరంగ్ కార్యక్రమాలు దోహదపడతాయని ప్రియదర్శిని విద్యా సంస్థల చైర్మన్ చందు రామారావు చెప్పారు. బుర్రిపాలెం రోడ్డులోని డిగ్రీ కళాశాలలో శనివారం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ చదువుతోపాటు ఆటలు, సృజనాత్మక కార్యక్రమాలు, సంగీతం, సాహిత్యం కూడా ముఖ్యమేనన్నారు. ప్రిన్సిపల్ చింతల శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉండే సృజనాత్మకతను వెలికి తీసేందుకు యంగ్ తరంగ్ ఉపయోగపడుతుందని అన్నారు. కార్యక్రమాన్ని చేపట్టిన సంస్కృతి టీమ్ సభ్యులను అభినందించారు. విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. బొల్లిముంత శివరామకృష్ణ, కాకుమాను వెంకటేశ్వరరావు, రజని, సుధ, అపర్ణ, హేమ, నస్రీన్ పాల్గొన్నారు.

'ఇల్లు కట్టకుండా కాంట్రాక్టర్లు డబ్బులతో ఊడాయించారు'

తెనాలి రూరల్, సెప్టెంబరు 28: జగనన్న కాలనీలో ఇంటి నిర్మాణాలు చేపట్టేందుకు నియమించిన కాంట్రాక్టర్లు నిర్మాణ పనులు పూర్తి చేయకుండా డబ్బులు తీసుకుని ఉడాయించారని తహసీల్దార్ గోపాలకృష్ణ, హౌసింగ్ అధికారుల దృష్టికి పలువురు కాలనీవాసులు తీసుకువచ్చారు. శనివారం మండలంలోని అంగలకుదురులో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా జగనన్న కాలనీలో స్థలాల లబ్ధిదారులు నిర్మాణ పనుల విషయంలో కాంట్రాక్టర్లు మోసం చేశారని దీంతో తమ గృహాలు పూర్తికాలేదని అధికారులకు తెలిపారు. దీంతో అటువంటి వారిపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని అధికారులు వారికి సూచించారు. ప్రభుత్వం పేదల ఇంటి నిర్మాణాలకు అన్ని విధాలుగా సహాయ సహకారాలందించేందుకు సిద్ధంగా ఉందన్నారు. ఏఎస్ఎమ్ ఝాన్సీ, సచివాలయ ఉద్యోగులు, పలుశాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు

అంగలకుదురులో గ్రామసభ..

జగనన్న కాలనీలో స్థలాలు పొందిన లబ్ధిదారులు ఇంటి నిర్మాణ పనులు చేపట్టేందుకు ముందుకు రావాలని తహసీల్దార్ గోపాలకృష్ణ అన్నారు. శనివారం మండలంలోని అంగలకుదురులో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలో స్థలాలు పొందిన లబ్ధిదారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

డాక్టర్ విజయ భారతి మృతి తీరని లోటు

పొన్నూరుటౌన్, సెప్టెంబరు 28: రచయిత్రి డాక్టర్ విజయ భారతి మృతి తీరని లోటు అని ఆంధ్రప్రదేశ్ దళిత మహాసభ వ్యవస్థాపకుడు డాక్టర్ కత్తి పద్మారావు శనివారం నివాళులర్పించారు. మహాకవి బోయి భీమన్న కుమార్తె, ప్రముఖ అంబేద్కర్ వాది బొజ్జతారకం సతీమణి విజయభారతి మృతి సాహితీలోకానికి తీరని లోటన్నారు. తెలుగు అకాడమీని పునఃప్రతిష్ఠ చేసిన గొప్ప కవి విజయ భారతిగా పేర్కొన్నారు.